మంగళవారం
14-02-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 233
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

శిథిలాలు తవ్వే కొద్దీ శవాలు

టర్కీపై భూకంపం పగబట్టినట్టుంది. మరోసారి ఆ దేశంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 4.7 తీవ్రతతో భూకంపం సంభవించినట్టు అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. దక్షిణ టర్కీ నగరమైన కహ్రామన్‌మరాస్‌కు సమీపంలో 15.7 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్టు పేర్కొంది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు భూకంపం సంభవించినట్టు వివరించారు.

2లో

ఎగువ భద్రతో

సీమకు తీవ్ర నష్టం

- రాష్ట్ర ప్రాజెక్టులు పట్టించుకోని కేంద్రం
- నిలదీయని రాష్ట్ర ప్రభుత్వం
- మూడున్నరేళ్లుగా సాగని ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- సీపీఐ బృందం ప్రాజెక్టుల పరిశీలన ప్రారంభం

విశాలాంధ్ర - బొమ్మనహాళ్/అనంతపురం అర్బన్/డి.హీరహాళ్:

కర్ణాటకలోని తుంగభద్ర ఎగువ భాగాన ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మిస్తే భవిష్యత్తులో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ఎగువ భద్రకు కేంద్ర ప్రభుత్వం 5,300 కోట్లు కేటాయించి జాతీయ హోదా కల్పించినా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రశ్నించక పోవడం విచారకరమన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా సోమవారం ఎగువ భద్ర బొమ్మనహాళ్ సరిహద్దులోని హెచ్ఎల్‌సి కాలువలను రామకృష్ణ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ పరిశీలన ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగుతుంది. మొదటి రోజు ఎగువ భద్రతో పాటు హెచ్ఎల్సీ 105కిలోమీటర్ల వద్ద హెచ్ఎల్సీ కాలువను పరిశీలించారు. పరిశీలనకు వచ్చిన రామకృష్ణ బృందానికి నియోజకవర్గ సీపీఐ, మండల టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు ముందుకు సాగడం లేదనీ, కనీసం కాలువలు తవ్వకం కూడా సాగడం లేదన్నారు. కాలువలు తవ్వేందుకు ప్రభుత్వం ఆసక్తికనపరచడంలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్వీర్యం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగంపట్ల నిర్లక్ష్యంగా ఉందన్నారు. సీఎం సొంత జిల్లా కడపలోనూ ఒక్క కాలువ కూడా తవ్వలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరానికి కూడా నిధులు ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదనీ, సహకరించడం లేదన్నారు. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు జీవనాధారమైన తుంగభద్ర నికర జలాలకు గండికొడుతూ కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ప్రాజెక్టును వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎగువభద్ర ప్రాజెక్టు నిర్మాణం వల్ల రాయలసీమ ప్రాంతానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని, ఎగువ ప్రాజెక్టుపై మౌనంవహిస్తూ సీమ రైతాంగానికి తీరని

- మిగతా 2 లో

మళ్లీ ధరల షాక్!

- పెరిగిన రిటైల్ ద్రవ్యోల్బణం
- మూడు నెలల గరిష్టానికి చేరిక

న్యూఢిల్లీ:

రిటైల్ ద్రవ్యోల్బణం మరోసారి పెరిగింది. 2023 తొలి నెల జనవరిలోనే అధికమైంది. గత ఏడాది డిసెంబర్‌తో పోలిస్తే ఏకంగా 0.80 శాతం పెరిగి మూడు నెలల గరిష్టానికి చేరింది. దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం మరోసారి భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) పరిమితిని మరోసారి మించిపోయింది. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ఈ ఏడాది జనవరిలో 6.52 శాతానికి పెరిగింది. గత డిసెంబర్‌లో ఇది 5.72 శాతంగా నమోదుగా కాగా.. జనవరిలో 0.80 శాతం అధికమైంది. ఈ గణాంకాలను సోమవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆహార పదార్థాల ధరల పెరుగుదలతో ఆహార ద్రవ్యోల్బణం 5.94 శాతానికి దూసుకెళ్లిందని, అందువల్లే రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగిందని ప్రభుత్వ గణాంకాలు తెలిపాయి. రిటైల్ ద్రవ్యోల్బణంలో ఆహార పదార్థాలు దాదాపు 40 శాతం వాటా కలిగి ఉంటాయి. నిత్యావసరాలు, ఆహార పదార్థాలు, కూరగాయాల ధరలను ఈ రిటైల్ ద్రవ్యోల్బణం సూచిస్తుంది. అంటే గతేడాది డిసెంబర్‌తో పోలిస్తే జనవరిలో దేశంలో ధరలు పెరిగినట్టు లెక్క. కూరగాయల ధరలు గత డిసెంబర్‌లో 11.70 శాతం నమోదు కాగా, గత నెలలో 15.08 శాతానికి పరిమితం అయ్యాయి. ఆయిల్ అండ్ లైట్ ద్రవ్యోల్బణం స్వల్పంగా 10.97 నుంచి 10.84 శాతానికి పడిపోయింది. తృణ ధాన్యాల ధరలు 13.79 శాతం నుంచి 16.12 శాతానికి పెరిగాయి. రెండు నెలల పాటు తగ్గుముఖం పట్టిన రిటైల్ ద్రవ్యోల్బణం... 2023 తొలి నెలలోనే ఎగిసింది. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతం నుంచి 6 శాతం మధ్య ఉంచాలని ఆర్బీఐ లక్ష్యంగా పెట్టుకుంది. 10 నెలల తర్వాత గతేడాది నవంబర్‌లో ద్రవ్యోల్బణం 5.88 శాతానికి దిగివచ్చింది. డిసెంబర్‌లో 5.72 శాతానికి చేరింది. అయితే మించిపోయింది. ద్రవ్యోల్బణం పెరుగుదలతో రెపో రేటును రానున్న కాలంలోనూ ఆర్బీఐ మరింత పెంచే అవకాశాలు ఉంటాయి. ఇటీవలే రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల (0.25శాతం) మేర పెంచింది ఆర్బీఐ. వరుసగా ఆరోసారి రెపో రేటును అధికం చేసింది. దీంతో రెపో రేటు

- మిగతా 2 లో

ఈఏపీసెట్ ఎప్పుడు?

మరోసారి అధికారుల వైఫల్యం

3లో

ఇదీ లోకం!

వామ్మో, నా వెంట పడకు... నేను నీ సీక్రెట్ లవర్‌ని మాత్రమే!

పెద్ద పులి బతికే ఉంది

- వేలుపిళ్లై ప్రభాకరన్ ప్రజల ముందుకు వస్తారు
- ఎల్టీటీఈ ఆవిర్భావానికి ప్రణాళికతో సిద్ధంగా ఉన్నారు
- తమిళ జాతీయోద్యమ నాయకుడు పజా నెడుమారన్

తంజావూరు:

శ్రీలంకలో ఈలం తమిళుల నాయకుడు (ఎల్టీటీఈ చీఫ్) వేలుపిళ్లై ప్రభాకరన్ బతికే ఉన్నారని, సరైన సమయంలో ప్రజల ముందుకు వస్తారని తమిళ జాతీయోద్యమ నాయకుడు పజా నెడుమారన్ సోమవారం తెలిపారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన ప్రకటన 'నిజమైన ప్రకటన' అని పేర్కొంటూ, వేలుపిళ్లై ప్రభాకరన్ ఇప్పుడు కనిపించడానికి అనుకూలమైన వాతావరణం నెలకొని ఉందని తెలిపారు. అంతర్జాతీయ (రాజకీయ) వాతావరణం, శ్రీలంకలోని సింహళీయులు రాజపక్సేపై తీవ్ర వ్యతిరేకత తమిళుల ఈలం నాయకుడు ప్రభాకరన్ ప్రజల ముందుకు రావడానికి సరైన పరిస్థితులను సృష్టించిందని అన్నారు. ప్రభాకరన్ ఆరోగ్యంగా, దృఢంగా ఉన్నారని చెప్పారు. ఆయన కుటుంబం ప్రభాకరన్‌కు అందుబాటులో ఉందని అన్నారు. అయితే, ఆయన ఎక్కడున్నారనే విషయాన్ని తాను ఇప్పుడే వెల్లడించలేనని తెలిపారు. తాను ఈ ప్రకటన ప్రభాకరన్ కుటుంబ సభ్యుల అనుమతితోనే చేస్తున్నట్లు వివరించారు. ఈ ప్రకటనతో అతనిపై వ్యాపించిన 'ప్రణాళిక' అనుమానాలకు తెరపడుతుందని నెడుమారన్ అన్నారు. శ్రీలంకలోని ఈలం తమిళుల ఆవిర్భావానికి ప్రభాకరన్ త్వరలో ఒక ప్రణాళికను ప్రకటించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. శ్రీలంకలోని తమిళులు, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో నివసిస్తున్న తమిళులు కలిసి నిలబడాలని, తమ పూర్తి మద్దతును తనకు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్టీటీఈ) శక్తివంతంగా ఉన్నంత వరకు, శ్రీలంకలో తమ ఆధీనంలో ఉన్న ప్రాంతాలలో భారత్‌కు

- మిగతా 2 లో

ధాన్యం అమ్ముకోలేని

దుస్థితి

- ప్రతి గింజా కొంటామన్న ప్రభుత్వం
- ఆర్బీకేల చుట్టూ అన్నదాతల ప్రదక్షణలు
- మన్యం జిల్లా రైతుల గోడు వినని అధికారులు
- ఏనుగుల వల్ల పంట నష్టపోతున్న వైనం
- తక్షణమే ధాన్యం కొనుగోలుకు రైతుల డిమాండ్

2లో

వేసవిలో

విద్యుత్ కోతలుండవట!

- పెద్దిరెడ్డి ఉవాచ
- మార్చి నాటికి వంద కొత్త సబ్‌స్టేషన్లు
- ప్రైవేట్ కంపెనీల బకాయిల వసూళ్లపై దృష్టి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

రానున్న వేసవిలో డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుత్ ఉత్పాదనకు ప్రణాళిక సిద్ధం చేసుకుని విద్యుత్ కోతల్లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఇంధన, అటవీ, పర్యావరణ, శాస్త్ర-సాంకేతిక, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. సచివాలయంలోని మూడో బ్లాక్‌లో సోమవారం ఇంధనశాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కృష్ణపట్నం, ఎన్టీటీపీఎస్‌లోని కొత్త యూనిట్లను కూడా వినియోగంలోకి తీసుకొచ్చేలా పనులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం రోజుకు 210 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ డిమాండ్ 240 మిలియన్ యూనిట్లకు పెరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ ఉత్పత్తి, కొనుగోళ్లకు అవసరమైన చర్యలు

- మిగతా 2 లో

మా గగనతలంలోకి 10కి పైగా అమెరికా బెలూన్లు: చైనా

బీజింగ్: అమెరికా సైన్యం తమ బెలూన్‌ను గగనతలంలో పేల్చివేయడంపై చైనా మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. పౌరసేవల కోసం తాము నింగిలోకి పంపిన బెలూన్‌ను నిఘా బెలూన్ పేరుతో అమెరికా కూల్చివేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా బెలూన్‌లు పదిసార్లకు పైగా తమ గగతతలంలోకి ప్రవేశించాయని తెలిపింది. చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ... అక్రమంగా ఇతర దేశాల గగనతలాల్లోకి ప్రవేశించడం అమెరికాకు సర్వసాధారణమేనని ఆయన విమర్శించారు. గత ఏడాది జనవరి నుంచి ఆమెరికాకు చెందిన 10కి పైగా బెలూన్‌లు చైనా అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా తమ గగనతంలో ఎగిరాయని తెలిపారు. ఆ చొరబాట్లపై చైనా ఎలా స్పందిస్తుందన్న ప్రశ్నకు వాంగ్ సమాధానమిస్తూ... బీజింగ్ వ్యవహరించిన తీరు బాధ్యతాయుతంగా, ప్రొఫెషనల్‌గా ఉందన్నారు. "చైనా గగనతలంలోకి అక్రమంగా ప్రవేశించిన అమెరికా హై ఆల్టిట్యూడ్ బెలూన్ల గురించి మీరు మరింత తెలుసుకోవాలనుకుంటే, మీరు అమెరికాను ప్రశ్నించాలని నేను సూచిస్తున్నాను" అని ఆయన వెల్లడించారు. ఫిబ్రవరి 4న చైనా నిఘా బెలూన్‌ను కూల్చిన ఘటనపై ఎట్టకేలకు బీజింగ్ తో సంప్రదింపులు జరిపినట్లు అమెరికా అధికారులు పేర్కొన్న కొద్దిసేపటికే చైనా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ విషయంపై కమ్యూనికేట్ చేయడానికి పెంటగాన్ (అమెరికా డిఫెన్స్ డిపార్ట్ మెంట్) చేసిన ప్రయత్నాలు రోజుల తరబడి విఫలమయ్యాయని రక్షణ అధికారి రైడర్ చెప్పారు.

మరో ఎగిరే వస్తువును కూల్చేసిన అమెరికా

అమెరికా-కెనడా సరిహద్దులోని మిచిగాన్ ఎగువ ద్వీపకల్పం, హురాన్ సరస్సు గగనతలంపై ఎగురుతున్న వస్తువును అమెరికా కూల్చివేసింది. గత వారం రోజుల్లో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం నాలుగోసారి.

శిథిలాలు తవ్వే కొద్దీ శవాలు

- కొనసాగుతున్న సహాయక చర్యలు
- టర్కీ, సిరియాలో 35వేలకు చేరిన మరణాలు
- దక్షిణ టర్కీలో మరోసారి భూకంపం

అంకారా: టర్కీపై భూకంపం పగబట్టినట్టుంది. మరోసారి ఆ దేశంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 4.7 తీవ్రతతో భూకంపం సంభవించినట్టు అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. దక్షిణ టర్కీ నగరమైన కహ్రమన్‌మరాస్‌కు సమీపంలో 15.7 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్టు పేర్కొంది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు భూకంపం సంభవించినట్టు వివరించారు. ప్రకృతి విలయానికి గత వారం రోజులుగా టర్కీ వాసులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని గడుపుతున్నారు. భూకంపం సృష్టించిన విధ్వంసానికి ఊళ్లకు ఊళ్లే తుడుచుపెట్టుకుపోయాయి. చారిత్రక నగరాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వేలాది భవనాలు నేలమట్టమయ్యాయి. టర్కీ, సిరియాలో గత సోమవారం సంభవించిన భారీ భూకంపం కారణంగా ఇప్పటివరకు 34 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. టర్కీలో 30 వేలు, సిరియాలో 5వేల మంది మరణించినట్లు అధికారులు ప్రకటించారు. 92,600 మంది గాయపడ్డారు. టర్కీ, సిరియాలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు గడ్డకట్టే చలిని సైతం లెక్కచేయడం లేదు. శిథిలాల నుంచి ఆరు రోజుల తర్వాత కూడా కొందరు ప్రాణాలతో బయటపడుతున్నారు. తాజాగా ఆరు నెలల గర్భిణీ, ఇద్దరు పిల్లలతో సహా కొంతమంది సురక్షితంగా బయటకు వచ్చారు. అయితే, భూకంపంలో అధిక ప్రాణనష్టానికి అక్రమ నిర్మాణ కార్యకలాపాలే కారణమని టర్కీ అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో 130 మందికిపైగా కాంట్రాక్టర్లను టర్కీ న్యాయ అధికారులు విచారిస్తున్నారు. మరోవైపు ఇక్కడి పరిస్థితులను ఆసరాగా చేసుకుని దోపిడీలకు, మోసాలకు పాల్పడుతున్న ముఠాలను కట్టడి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. భూకంపం కారణంగా కుప్పకూలిన భవనాల నిర్మాణాలకు బాధ్యులైన 134 మందిని విచారిస్తున్నట్లు టర్కీ న్యాయ శాఖ మంత్రి బెకిర్ బోజ్‌డాగ్ వెల్లడించినట్టు టర్కీ అధికారిక మీడియా అనడోలు తెలిపింది. వీరిలో ఏడుగురిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. చనిపోయినవారి శవాలను ఖననం చేయడానికి భూకంప ప్రభావిత ప్రాంత శ్మశానాల్లో పెద్ద ఎత్తున బుల్డోజర్లు, పొక్లెయిన్‌లు నిరంతరం పని చేస్తుండటం ఈ విలయానికి అద్దం పడుతోంది.

175 గంటల తర్వాత...

ఇక హయట్ ప్రావిన్సులో దాదాపు 175 గంటల తర్వాత శిథిలాల కింద ఉన్న ఓ మహిళను ప్రాణాలతో రక్షించారు. వారం రోజుల తర్వాత కూడా ఆమె శిథిలాల కింద సజీవంగా ఉంది. మహిళను రక్షించిన వీడియోను ఇస్తాంబుల్ మున్సిపాలిటీ రిలీజ్ చేసింది. ఆమెను నైదీ ఉమేగా గుర్తించారు. కాంక్రీట్ శిథిలాల కింద ఉన్న ఆమెను స్ట్రెచర్‌పై తీసుకెళ్లారు. కాగా హటాయ్ ప్రావిన్సులోని అంటక్యా ప్రాంతంలో శిథిలాల కింద చిక్కుకున్న ఓ వ్యక్తిని 167 గంటల తర్వాత రక్షించారు. ఓ 55 ఏళ్ల మహిళను దాదాపు 159 గంటల తర్వాత కాపాడారు. 85 ఏళ్ల మహిళను 152 గంటల తర్వాత రక్షించారు.

సామూహిక ఖననాలు

టర్కీలోని మరాష్ ప్రాంతంలో ఆదివారం నాటికి సుమారు 5 వేల మృతదేహాలను ఒకే ప్రాంతంలో సమాధి చేశారు. శవాలను మోసుకొచ్చే వాహనాల శబ్దం వినిపిస్తూనే ఉందని స్థానిక యంత్రాంగం వెల్లడించింది. తమ వారిని ఖననం చేసేందుకు వచ్చినవారి రోదనలు ఆ ప్రాంతంలో మిన్నంటాయి. శ్మశాన వాటిక కోసం పైన్ అడవులను కొట్టివేశారు. ఇక సమాధులను తవ్వేందుకు బుల్డోజర్లు, పొక్లెయిన్లు నిరంతరం పనిచేస్తూనే ఉన్నాయి. చనిపోయిన వారిని సంప్రదాయబద్ధంగా పంపించాలని అయినవారు కోరుకుంటున్నారు. ఆ నిమిత్తం అధికారులు తాత్కాలిక టెంట్లు ఏర్పాటు చేశారు. అక్కడ మృతదేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు.

అమెరికన్లంతా రష్యా వీడాలి

మాస్కోలో అమెరికా రాయబార కార్యాలయం ప్రకటన

మాస్కో: అమెరికా జాతీయులందరూ వెంటనే రష్యాను వీడిపోవాలని అమెరికా హెచ్చరించింది. రష్యా-ఉక్రెయిన్ మధ్య దాడులు తీవ్రతరమవుతున్న నేపథ్యంలో తీవ్రతరమవుతోన్న దాడులతోపాటు రష్యన్ భద్రతాసంస్థల నుంచి ఏకపక్ష అరెస్టులు, వేధింపుల ప్రమాదం పొంచి ఉందని పేర్కొంది. 'రష్యాలో నివసిస్తున్న లేదా పర్యటిస్తోన్న అమెరికా జాతీయులు వెంటనే దేశాన్ని వీడి బయలుదేరాలి' అని మాస్కోలోని అమెరికా రాయబార కార్యాలయం ప్రకటించింది. తప్పుడు నిర్బంధాల అవకాశం నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించింది. దీంతోపాటు అమెరికన్లను రష్యాకు వెళ్లొద్దని పేర్కొంది. గూఢచర్యానికి పాల్పడుతున్నాడనే అనుమానంతో అమెరికా పౌరుడిపై క్రిమినల్ కేసు ప్రారంభించినట్లు రష్యాకు చెందిన ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. 'రష్యన్ భద్రతాసంస్థలు కొంతమంది అమెరికా పౌరులను తప్పుడు ఆరోపణలపై అరెస్టు చేశాయి. అమెరికన్లను నిర్బంధించడంతోపాటు వేధింపులకు పాల్పడుతున్నాయి. పైగా, వారికి న్యాయమైన, పారదర్శకమైన సేవలను అందించేందుకు నిరాకరించాయి. సరైన సాక్ష్యాలు సమర్పించకుండానే రహస్య విచారణల్లో వారిని దోషులుగా తేల్చాయి' అని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది. ముఖ్యంగా అమెరికన్ మత బోధకులను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది.

వేసవిలో విద్యుత్ కోతలుండవట!

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న బొగ్గు నిల్వలను పెంచుకోవాలన్నారు. ఈ ఏడాది మార్చి నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 1.25 లక్షల కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లను రైతులకు అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా పగటిపూట తొమ్మిదిగంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను రైతన్నలకు అందించాలని, అలాగే అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుకి ఉచిత విద్యుత్ కనెక్షన్‌ను మంజూరు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్‌లలో 100 సబ్‌స్టేషన్లను కూడా అదే గడువు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు కర్మాగారాలు, వ్యాపార సంస్థలు, హెచ్‌టీ కనెక్షన్‌ల నుంచి రావాల్సిన రూ.349 కోట్లు బకాయిలపై డిస్కంలు దృష్టి సారించాలని, రెగ్యులర్ విద్యుత్ బిల్లులతో పాటు, బకాయిలకు కూడా డిమాండ్ నోటీస్‌లను జారీ చేయాలని సూచించారు. జగనన్న లేఅవుట్ల విద్యుతీకరణపై సమీక్షించగా, మొత్తం 9979 జగనన్న కాలనీ లేఅవుట్లకు గాను ఇప్పటివరకు 2617 లేఅవుట్లలో విద్యుదీకరణ పూర్తయినట్లు అధికారులు వివరించారు. ఈ సమీక్షలో ఇంధనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్, ట్రాన్స్‌కో సీఎండీ బీ శ్రీధర్, జేఎండీ ఐ.పృథ్వితేజ్, విజిలెన్స్ జేఎండీ మల్లారెడ్డి, ట్రాన్స్ కో సీఎండీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎగువ భద్రతో సీమకు తీవ్ర నష్టం

(మొదటిపేజీ తరువాయి)

ద్రోహం చేస్తున్నారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అన్యాయం జరుగుతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నోరుమెదపడంలేదన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల అనంతపురం, కర్నూలు జిల్లాలతో పాటు కర్ణాటకలోని బళ్లారి, రాయచూరుతో పాటు జిందాల్‌కు వచ్చే నీటి వాటా పూర్తిగా తగ్గుతుందన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాలు తాగు నీటి కోసం తుంగభద్ర జలాశయంపై ఆధారపడి ఉన్నాయన్నారు. కర్ణాటకలో ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో అక్కడి బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని ప్రాజెక్టు నిర్మించేందుకు పూనుకున్నదని విమర్శించారు. తమ 8 రోజులు పర్యటన పూర్తయిన తర్వాత నివేదిక తయారుచేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కేంద్ర ఇరిగేషన్ శాఖ మంత్రి షెకావత్ దృష్టికి తీసుకెళ్లి ప్రాజెక్టుల స్థితిగతులపై వివరిస్తామని తెలిపారు. ఇరిగేషన్ రంగాన్ని పూర్తిగా గాలికి వదిలేశారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్కడి రైతులు సీపీఐ బృందం వద్దకు వచ్చి ఎగువ భద్ర నిర్మిస్తే తుంగభద్ర జలాశయంకు కోత పడుతుందని వాపోయారు. హెచ్ఎల్‌సి కాలువ దుస్థితిని అధికారులతోనూ రైతులతోనూ చర్చించారు. మార్చి చివరిదాకా సాగునీరు ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రైతులు కోరారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి లేఖ రాస్తామని రామకృష్ణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, జగదీశ్, ఈశ్వరయ్య, రామచంద్రయ్య, జంగాల అజయ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రైతు సంఘం నాయకులు కాటమయ్య, సీపీఐ జిల్లా జాఫర్, సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య కర్నూలు జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, మల్లికార్జున, రాజారెడ్డి, సంజీవప్ప, కేశవరెడ్డి, రామకృష్ణ, శ్రీరాములు, రమణ, రాజేష్, నాగరాజు, గోపాల్ తదితరులు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ ధరల షాక్!

(మొదటిపేజీ తరువాయి)

మొత్తంగా 6.25 శాతానికి చేరింది.

ఏప్రిల్‌లో మళ్లీ వడ్డీరేట్ల పెంపు?

రిటైల్ ద్రవ్యోల్బణంపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రిన్సిపల్ ఎకనమిస్ట్ సాక్షి గుప్తా స్పందించారు. 'కీలక ద్రవ్యోల్బణం సంక్లిష్టంగా ఉంది. దీనికితోడు గోధుమలతోపాటు ప్రోటీన్ ఆహార పదార్థాల ధరలు పెరగడం వల్లే జనవరి రిటైల్ ద్రవ్యోల్బణం శరవేగంగా 6.52 శాతానికి పెరిగింది. అంతకు ముందు రెండు నెలలు (నవంబర్, డిసెంబర్) ద్రవ్యోల్బణం స్వల్పంగా దిగి వచ్చినా.. అది విస్తృత ప్రాతిపదికన కాదని తేలింది. కీలక ద్రవ్యోల్బణం ఇంకా ఆందోళనకరంగానే ఉందంటూ గతవారం 25 బేసిక్ పాయింట్లు రెపోరేట్‌ను ఆర్బీఐ పెంచేసింది. తాజా పరిణామాలు మరో దఫా ఏప్రిల్‌లో వడ్డీరేట్ల పెంపు తప్పక పోవచ్చు. బాండ్ల ధరలు 7.4 శాతాన్ని దాటొచ్చు' అని అభిప్రాయ పడ్డారు.

'పెద్ద పులి' బతికే ఉంది

(మొదటిపేజీ తరువాయి)

విద్వేషపూరితమైన శక్తులు ఏవీ పట్టుసాధించేందుకు అనుమతించలేదని ఆయన అన్నారు. వారు అటువంటి శక్తులను వ్యతిరేకించడమే కాకుండా భారతదేశానికి వ్యతిరేకంగా ఉన్న దేశాల నుంచి ఎటువంటి మద్దతును పొందలేదని తెలిపారు. 2009లో శ్రీలంక ఆర్మీకి, ఎల్టీటీఈకి మధ్య జరిగిన యుద్ధంలో ప్రభాకరన్ హతమైన విషయం గుర్తుండే ఉంటుంది. తమిళంలో 'ఈలం' అనేది తమిళ ప్రజల మాతృభూమిని సూచిస్తుంది. నెడుమారన్ వ్యాఖ్యలపై శ్రీలంక మాజీ ఎంపీ శివాజిలింగమ్ స్పందించారు. అప్పుడు ప్రభాకరన్ మరణించాడని లంక ప్రభుత్వం చూపించిన మృతదేహం నిజంగా ప్రభాకరన్‌దే అని ఇప్పటికీ నిరూపించలేదని వివరించారు.

ఉక్రెయిన్‌కు పాక్ ఆయుధాలు?

యూరప్: ఆర్థిక సంక్షోభంతో అల్లాడిపోతున్న పాకిస్తాన్... ఉక్రెయిన్‌కు ఆయుధాలను అమ్ముకుంటోంది. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యను వ్యతిరేకిస్తున్న అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌కు అన్ని విధాలుగా సాయమందిస్తున్నాయి. అందుకే రష్యా దళాలను ఉక్రెయిన్ సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతోంది. అయితే గుట్టు చప్పుడు కాకుండా పాకిస్తాన్ కూడా ఉక్రెయిన్ ఆయుధాలు సరఫరా చేస్తోందని ఆంగ్ల మీడియా సంస్థ ప్రత్యేక కథనం వెల్లడించింది. తాజాగా పాకిస్తాన్ 10వేల రాకెట్ లాంఛర్లను ఉక్రెయిన్‌కు సరఫరా చేసింది. జర్మనీ పోర్టు మీదుగా.. పోలాండ్ నుంచి ఈ రాకెట్ లాంఛర్లను ఉక్రెయిన్‌ను పంపినట్లు తెలుస్తోంది. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోయిన పాకిస్తాన్ తమకు చౌక ధరకే ఇంధనం విక్రయించాలని

ఓవైపు రష్యాను కోరుతూనే మరోవైపు ఆ దేశంతో యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్‌కు నిరంతరం ఆయుధాలను సరఫరా చేస్తోంది. కరాచీలోని షిప్పింగ్ కంపెనీ 'ప్రాజెక్ట్ షిప్పింగ్' గత నెలలో పాకిస్తాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల నుంచి 146 కంటైనర్లను ఉక్రెయిన్‌కు తరలించింది. గత నెలలో పాకిస్తాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు 50 వేల డిఫెన్స్ స్టోర్లను కరాచీ మీదుగా పంపించాయి. వీటిని కరాచీ నుంచి పోలాండ్లోని గాన్స్ పోర్ట్‌కు తరలించి, అక్కడి నుంచి ఉక్రెయిన్‌కు చేరవేసినట్లు సమాచారం. ఉక్రెయిన్‌తో సరిహద్దును పంచుకుంటున్న తూర్పు ఐరోపా దేశాల మీదుగా పాకిస్తాన్ తయారు చేసిన సైనిక పరికరాలను ఉక్రెయిన్‌ను చేరవేస్తున్నారు. ఉక్రెయిన్ సైన్యం ఆర్డర్ చేసిన ఆయుధాలను తూర్పు యూరప్‌లోని ఆయుధ సంస్థలకు పంపడానికి ఇస్లామాబాద్‌కు చెందిన ఆయుధ సరఫరాదారు డీఎంఐ అసోసియేట్స్... ఆయా సంస్థలతో కలిసి పని చేస్తోంది. ఈ సాయానికి బదులుగా ఎంఐ-17 హెలికాప్టర్లను అప్‌గ్రేడ్ చేయడంలో సహకరిస్తామని పాకిస్తాన్‌కు ఉక్రెయిన్ హామీ ఇచ్చింది. పాక్ హెలికాప్టర్లను అప్‌గ్రేడ్ చేయడంలో ఉక్రెయిన్‌కు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్లు, ఇండస్ట్రియల్ మెరైన్ గ్యాస్ టర్బైన్ల తయారీ సంస్థ ఒకటి నిమగ్నమైందని తెలుస్తోంది. గత ఏడాది యూకే తరపున ఉక్రెయిన్‌కు ఆయుధాలు చేరవేయడంలో పాకిస్తాన్ ముఖ్య పాత్ర పోషించింది. రావల్పిండిలోని నూర్ ఖాన్ ఎయిర్ బేస్ నుంచి మధ్యధరా ప్రాంతంలోని బ్రిటిష్ ఎయిర్‌బేస్ మీదుగా రుమేనియాలోని అఫ్రమ్ ఇయాన్‌కూ క్లజ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు మిలటరీ హెలికాప్టర్ల ద్వారా ఆయుధాలను తరలించారు. ఇరాన్, అఫ్ఘనిస్థాన్ గగనతలం మీదుగా వెళ్తే త్వరగా ఉక్రెయిన్ చేరే అవకాశం ఉన్నప్పటికీ రష్యా దాడి చేస్తుందనే భయంతో ఆ దేశాల మీదుగా ఆయుధాలను తరలించే యత్నం చేయలేదు. సాహసం గ్లోబ్‌మాస్టర్ విమానం ద్వారా పాక్ నుంచి ఉక్రెయిన్‌ను ఆయుధాలను తరలించారని తెలుస్తోంది. ఉక్రెయిన్, పాకిస్తాన్ మధ్య బలమైన సైనిక, పారిశ్రామిక సంబంధాలున్నాయి.

ధాన్యం అమ్ముకోలేని దుస్థితి

విశాలాంధ్ర-పార్వతీపురం: రాష్ట్రంలో అన్ని విధాలుగా వెనుకబాటుకు గురైన ప్రాంతంగా శ్రీకాకుళం, ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లాలనే చెప్పవచ్చు. ఇక్కడి ప్రజలు కష్టపడి జీవించడానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. చిన్నచిన్న కమతాలు సాగు చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తారు. భూములు లేనివారు, ఉన్నవారు కూడా ఉపాధి హామీ పథకం పనులకు వెళతారు. అయితే నేడు వారు ఆరుగాలం పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి పడేకష్టాలు వర్ణనాతీతం. సాధారణంగా రైతులు ఎక్కువ మంది సంక్రాంతి పండుగ తర్వాత వరి చేళ్లను నూర్చి వారి తిండికి కొంత ఉంచుకొని, మిగిలిన ధాన్యాన్ని అమ్మడం ఆనవాయితీ. ఇక్కడే అసలు సమస్య వచ్చింది. జిల్లా అధికారులు ప్రభుత్వ లక్ష్యం మేరకు డిసెంబరు లోపే లక్షా 92 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను వేగవంతంగా పూర్తి చేశారు. మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరితగతిన ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేశారు. కానీ నేడు చిన్న, సన్నకారు రైతుల వద్దనే ఎక్కువ ధాన్యం ఉండటంతో వారంతా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం దళారుల ప్రమేయం లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని పెద్దఎత్తున ప్రచారం చేసింది. కానీ సచివాలయంలో పని చేసే వ్యవసాయ సహాయకుల సహాయ సహకారాలతో ఎక్కువ మంది దళారులు రంగ ప్రవేశం చేసి రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరణ చేశారన్నది జగమెరిగిన సత్యం. అయితే ఆర్బీకేల చుట్టూ తిరగలేక, పనులు మానుకోలేక గ్రామాల్లో ఉండే దళారులను ఆశ్రయించి బస్తాకు 50 నుంచి 100 రూపాయల నష్టానికి ధాన్యం ఇస్తున్నామని అనేక మంది రైతులు తెలిపారు. ఈ ఏడాది జిల్లా అధికారులు మిల్లర్ల

ప్రమేయాన్ని నివారించడంలో శత శాతం విజయం సాధించినప్పటికీ, రైతులను మోసం చేస్తున్న ఈ తరహా వ్యాపారులను కట్టడి చేయకపోవడం వల్లే నేడు అన్ని గ్రామాల్లో రైతుల వద్ద ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. పాలకొండ, సీతానగరం, బలిజిపేట, వీరఘట్టం వంటి మండలాల్లో ఇంకా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలు ఉన్నాయని రైతులు స్పష్టం చేస్తున్నారు. గత సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయానికి రైతులు పెద్దఎత్తున వెళ్లి ధాన్యం కొనుగోలు చేసి న్యాయం చేయాలని వినతులు అందజేశారు. గత పదేళ్లుగా ఎన్నడూ లేనివిధంగా ధాన్యం దిగుబడి వచ్చిందని, ఎక్కడా ధాన్యం ముక్కలు కాలేదని, అధికారుల చుటూ కాళ్లరిగేలా తిరగడమేమిటని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం లక్ష్యాలను గతంతో పోల్చి తక్కువ లక్ష్యాన్ని ప్రభుత్వానికి నివేదిక అందజేయడం వల్లనే సంక్రాంతి పండుగ తర్వాత కొనుగోళ్ల పరిస్థితి తలెత్తింది. రైతులకు ఆందోళన కలిగించే మరో సమస్య ఏమిటంటే, గత ఆరేళ్లుగా కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస, సీతమ్మపేట, భామిని మండలాల్లో ఏనుగుల గుంపు వల్ల పంట ఉత్పత్తులకు జరుగుతున్న నష్టం అంతాఇంతా కాదు. చాలా మంది రైతులు నష్టపరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే అధికారులు మాత్రం చెల్లింపులు చేయడం లేదు. అధికారులు ఏనుగుల తరలింపుపై కూడా ప్రత్యేక దృష్టి సారించి, తగు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం ప్రధాన సమస్యలైన ఈ రెండింటిపై అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు దృష్టి పెట్టాలని మన్యం జిల్లాలోని 15 మండలాల ప్రజలు కోరుతున్నారు.

ఏనుగుల గుంపులను తరలించాలి: సీపీఐ డిమాండ్

జిల్లాలోని ఇటు కొమరాడ, అటు భామిని మండలంలో ఉంటున్న రెండు ఏనుగుల గుంపులను తరలించే ప్రక్రియను ప్రభుత్వం సత్వరమే చేపట్టాలని మన్యం జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శి కోరంగి మన్మధరావు, సహాయ కార్యదర్శి జీవన్ డిమాండ్ చేశారు. గత ఆరేళ్లుగా ఇక్కడ రైతులకు జరిగే నష్టం చాలా ఎక్కువని తెలిపారు. చివరకు ఎనిమిది మంది ప్రాణాలు కూడా కోల్పోయారని అన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి రెండు ప్రాంతాలలో ఏనుగుల గుంపులను తరలించాలని కోరారు.

కొనుగోలు సత్వరమే చేయాలి: రైతు సంఘం నేతల డిమాండ్

జిల్లాలోని ప్రస్తుతం చిన్న, సన్న కారు రైతుల వద్ద ఉన్న ధాన్యం నిల్వల మొత్తాన్ని కొనుగోలు చేయాలని రైతు సంఘం నేతలు బుడితి అప్పల నాయుడు, రెడ్డి లక్ష్మును నాయుడు డిమాండ్ చేశారు. జిల్లాలో సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నందున సత్వరమే కొనుగోలు చేయాలని అన్నారు. రైతుల ఆందోళన, ఆవేదనను గమనించి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పార్లమెంటు 13కు వాయిదా

- ముగిసిన బడ్జెట్ సమావేశాల మొదటి భాగం
- బడ్జెట్‌పై సాధారణ చర్చకు సమాధానమిచ్చిన ఆర్థిక మంత్రి

న్యూదిల్లీ: బడ్జెట్ సమావేశాల మొదటి భాగం పూర్తయిన తర్వాత పార్లమెంటు ఉభయ సభలు మార్చి 13వ తేదీకి వాయిదా పడ్డాయి. సోమవారం వాయిదా పడిన లోక్‌సభ నెల రోజుల తర్వాత తిరిగి సమావేశం కానుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. జనవరి 31న లోక్‌సభ, రాజ్యసభ సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. 'రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం'పై జరిగిన చర్చలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. సమావేశాల మొదటి భాగంలో కేంద్ర బడ్జెట్‌పై సాధారణ చర్చకు కూడా సీతారామన్ సమాధానమిచ్చారు. ఇదిలాఉండగా, అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ విచారణకు తమ డిమాండ్‌ను కొనసాగించిన ప్రతిపక్ష ఎంపీల నిరంతర అంతరాయాల తర్వాత, రాజ్యసభ బడ్జెట్ సమావేశాల మొదటి భాగం సోమవారం వాయిదాపడింది. సభ మార్చి 13న తిరిగి సమావేశం కానుంది.

అబ్బురపర్చిన హెలికాప్టర్ విన్యాసాలు

బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో ఏరో ఇండియా-2023 ప్రదర్శన ఘనంగా ప్రారంభమైంది. బెంగళూరులోని యలహంకలోని వైమానిక కేంద్రంలో ఐదు రోజులపాటు ఈ ప్రదర్శన కొనసాగనుంది. ఇందులో భాగంగా భారత్‌లో తయారైన తేలికపాటి హెలికాప్టర్... ప్రచండ్ ఆహుతులను ఆకట్టుకున్నది. హెలికాప్టర్‌తో పైలట్లు చేసిన విన్యాసాలు అందరినీ అబ్బురపరిచాయి. ఈ ప్రదర్శనలో భారత్‌లో తయారైన యుద్ధవిమానాలు, తేలికపాటి హెలికాప్టర్లను ప్రదర్శిస్తున్నారు. మొత్తం 109 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ షోకు హాజరయ్యారు. ఏరో ఇండియా ప్రదర్శనను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. రక్షణరంగంలో భారత్ బలోపేతమైందన్నారు. తక్కువ ఖర్చుతోనే రక్షణ పరికరాలను తయారుచేస్తున్నామని వెల్లడించారు. రక్షణరంగ సామగ్రిని ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నామని తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ ద్వారా ఇక్కడే విమానాలు తయారుచేసుకుంటున్నామని పేర్కొన్నారు. రక్షణరంగంలో పెట్టుబడులు పెట్టాలని ప్రైవేటు సంస్థలను కోరారు. విదేశాలకు ఎగుమతి చేసే రక్షణ సామగ్రిని ఆరు రెట్లు పెంచామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎన్నో కొత్తపుంతలు తొక్కామని చెప్పారు. పరిశ్రమలు ఇచ్చే అనుమతులను సరళతరం చేశామని వెల్లడించారు. కేంద్ర బడ్జెట్‌లో వస్తువుల తయారీ పరిశ్రమలకు పెద్దపీట వేశామన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు
డ్రాయింగ్ అధికారాలు కల్పించండి

మంత్రి బొత్సకు ఎస్టీయూ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు డ్రాయింగ్ అధికారాలు కల్పించాలని, సర్వీసు నిబంధనలకు అనుగుణంగా బదిలీలు, పదోన్నతులు కల్పించాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఎస్టీయూ నేతలు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం మంత్రి బొత్సను ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ అధ్వర్యంలో నేతలు కలిసి వినతిపత్రం అంద జేశారు. కేజీబీవీలోని ఉపాధ్యాయులకు ఐదు ప్రత్యేక సెలవులు ఇవ్వాలని, వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. దీనిపై మంత్రి బొత్స స్పందిస్తూ ఆయా సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో త్వరలో సమావేశం నిర్వహించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామచంద్రయ్య, మున్సిపల్ కోర్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్, కొమ్మ ప్రసాద్ పాల్గొన్నారు.

న్యాయమూర్తుల నియామకాన్ని నిర్ధారించుకోండి

కేంద్రానికి సూచించిన సుప్రీంకోర్టు

న్యూదిల్లీ: సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిన విధంగా న్యాయమూర్తుల నియామకం, బదిలీలకు సంబంధించిన సమస్యలపై 'అంచనాలలో ఎక్కువ భాగం' జరిగేలా చూసుకోవాలని సుప్రీంకోర్టు సోమవారం కేంద్రానికి సూచించింది. న్యాయమూర్తుల నియామకం 'కొన్ని సమస్యలకు సంబంధించినది' అని జస్టిస్ ఎస్.కె.కౌల్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి అందుబాటులో లేకపోవడంతో కొలీజియం సిఫార్సు చేసిన పేర్లను ఆమోదించడంలో కేంద్రం జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ దాఖలయిన పిటిషన్ సహా రెండు పిటిషన్లపై విచారణను మార్చి 2కి అత్యున్నత న్యాయస్థానం వాయిదా వేసింది. 'దయచేసి నిర్ధారించుకోండి, ఊహించిన వాటిలో చాలా వరకు పూర్తయ్యాయి. అటార్నీ జనరల్‌తో చెప్పండి' అని న్యాయమూర్తులు మనోజ్ మిశ్రా, అరవింద్ కుమార్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఫిబ్రవరి 6న ఐదుగురు న్యాయమూర్తులు... న్యాయమూర్తులు జస్టిస్ పంకజ్ మిథాల్, సంజయ్ కరోల్, పి.వి.సంజయ్ కుమార్, అహ్సానుద్దీన్ అమానుల్లా, మనోజ్ మిశ్రా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణం చేశారు. అలాగే సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ రాజేష్ బిందాల్, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ప్రమాణం చేయించారు. దీంతో సుప్రీంకోర్టులోని న్యాయమూర్తుల సంఖ్యను దాని పూర్తి మంజూరైన సంఖ్య 34కి తీసుకువెళ్లారు. కొలీజియం వ్యవస్థ ద్వారా న్యాయమూర్తుల నియామకం సుప్రీంకోర్టు, కేంద్రం మధ్య ప్రధాన వివాదంగా మారడంతో వివిధ వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి.

ఈఏపీసెట్ ఎప్పుడు?

- మరోసారి అధికారుల వైఫల్యం
- విద్యార్థుల్లో అయోమయం సృష్టిస్తున్న వైనం
- ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌పై ప్రభావం
- ఇప్పటికే విడుదలైన 'టీఎస్ ఎంసెట్'

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్ సీట్ల భర్తీ ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా జరగడం లేదు. గత విద్యా సంవత్సరం (2022) ప్రకటనకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ ఇప్పటివరకూ కొనసాగుతూనే ఉంది. దీనికి కారణం అధికారుల నిర్లక్ష్యమేననే విమర్శలున్నాయి. 2023-విద్యా సంవత్సర ప్రవేశ పరీక్షల్లోనూ ప్రభుత్వం అదే ధోరణితో ఉంది. ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్)-2023 ఉమ్మడి ప్రవేశ పరీక్ష షెడ్యూలు ఖరారులో జాప్యం నెలకొంది. ఇప్పటికే వారం రోజుల క్రితం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ ఎంసెట్-2023 షెడ్యూల్‌ను ప్రకటించింది. మే 7 నుంచి 11వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనుంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు అటు తెలంగాణలోను, ఇటు ఆంధ్రప్రదేశ్‌లోను చదువుతుంటారు. వారంతా రెండు రాష్ట్రాల ప్రవేశ పరీక్షలకు హాజరై...ఆ తర్వాత వారికి అనువైన రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలలను ఎంచుకోవడం ఆనవాయితీ. దీంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా టీఎస్ ఎంసెట్ ప్రకటనను జారీజేసినప్పటికీ ఏపీ ప్రభుత్వం ఇంతవరకు దానిపై స్పందించలేదు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోంది. ఈ ఏడాది కూడా ప్రకటనలో జాప్యం జరిగితే, కౌన్సెలింగ్ మరింత ఆలస్యమయ్యే పరిస్థితులున్నాయి. గతేడాది ఏపీఈఏపీసెట్-2022 ప్రకటన ఆలస్యంగా ఇవ్వడం, కౌన్సెలింగ్ జాప్యం కారణంగా...బైపీసీ విభాగం విద్యార్థులకు ఈ ఏడాది జనవరి 29వ తేదీ నుంచి ఈనెల 6వ తేదీ వరకు స్పాట్ కౌన్సెలింగ్‌కు షెడ్యూలు కొనసాగింది. స్పాట్ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన వారు 50శాతానికిపైగా బోధనా తరగతులు కోల్పోయారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం సీట్ల భర్తీ కోసం, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులను కన్వీనర్ కోటాలోకి పోటీపడీ మరీ చేర్చుకుంటున్నాయి. ఆ తర్వాత వారి బోధనా పరిస్థితులు, నైపుణ్య శిక్షణపై దృష్టి పెట్టడం లేదు. దీనివల్ల ప్రైవేట్ కళాశాలల్లో ఇంజినీరింగ్ చదివిన పట్టభద్రుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది.

పక్క రాష్ట్రాలపై ఏపీ అభ్యర్థుల చూపు

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ జాప్యం కారణంగా ఏటా ఇతర రాష్ట్రాలలోని ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాలకు ఇంజినీరింగ్ విద్యార్థులు తరలిపోతున్నారు. దీనికి ఏపీఈఏపీసెట్ ప్రకటన ఆలస్యంగా ఇవ్వడం, ఏడాది పొడవునా కౌన్సెలింగ్ షెడ్యూలు కొనసాగించడమే ప్రధాన కారణం. జాతీయ స్థాయిలో ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీలలో ప్రవేశాలు పొందేందుకు ఏటా నిర్వహించే జేఈఈ- మెయిన్స్, జేఈఈ-అడ్వాన్స్ పరీక్షలకు సమాంతరంగా ఏపీఈఏపీసెట్ ప్రకటనలు జారీ చేయడం, ఆ తర్వాత మళ్లీ దాన్ని మార్పుచేయడం రాష్ట్ర ప్రభుత్వానికి పరిపాటిగా మారింది. గతేడాది ఇదే పరిస్థితి ఎదురైంది. దీంతో ఏకకాలంలో రెండు పరీక్షలకు సిద్ధమవ్వడం విద్యార్థులకు భారమవుతోంది. తెలంగాణ ప్రభుత్వం తరహాగా జేఈఈ-మెయిన్స్ తేదీలకు భిన్నంగా ఏపీఈఏపీసెట్ ప్రకటన జారీలో అధికారులు విఫల మవుతున్నారు. ఈ విద్యా సంవత్సరం అలాంటి పరిస్థితులు తలెత్తకుండా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

ఇంటర్ విద్యార్థులకు వరుస పరీక్షలు

ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులపై వరుసగా పరీక్షల భారం పడుతోంది. మార్చి 16 నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలు ప్రారంభమవుతాయి. ఇప్పటికే జేఈఈ-మెయిన్స్, అడ్వాన్స్ మొదటి దశ పరీక్షలకు హాజరయ్యారు. వాటి కోసం రెండేళ్ల నుంచి విద్యార్థులు సిద్ధమవుతున్నారు. తొలి దశ జేఈఈ-మెయిన్స్ పూర్తయ్యాక... ఇంటర్ పరీక్షలపై వారంతా దృష్టి పెట్టాలి. ఆ తర్వాత ప్రయోగ పరీక్షలను పూర్తి చేసుకోవాలి. జేఈఈ-మెయిన్స్, అడ్వాన్స్ రెండో దశ పరీక్షలకు సిద్ధమవ్వాలి. ఆ తర్వాత తెలుగు రాష్ట్రాల్లోని ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు రాయాలి. ఈ మధ్యలో ఏపీతోపాటు పొరుగు రాష్ట్రాల్లో ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించే వివిధ ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాల ప్రవేశ పరీక్షలకు హాజరవ్వాలి. ఇంటర్ సీరియస్‌గా చదివే అభ్యర్థులతోపాటు కార్పొరేట్ కళాశాలల్లో చదువుతున్న వారంతా ఆయా పరీక్షలకు హాజరవుతారు. జేఈఈ-మెయిన్స్, అడ్వాన్స్ పరీక్షల తేదీల్లో రాష్ట్ర స్థాయి పరీక్షలు ఖరారు కాకుండా చూడాలి. రెండు తేదీలూ సమాంతరంగా ఉంటే...తప్పనిసరిగా రాష్ట్ర స్థాయి పరీక్షలను మార్పు చేసుకోవాల్సి ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకునే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా టీఎస్ ఎంసెట్ ప్రకటనను జారీ చేయగా, ఏపీ ప్రభుత్వం నుంచి ఏపీఈఏపీసెట్ ప్రకటన్ని ఇంతవరకూ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఏపీఈఏపీసెట్ ప్రకటనను సకాలంలో జారీజేసి, ఇంటర్ విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా చూడాల్సిన అవసరముంది.

చత్తీస్‌గఢ్ గవర్నరుతో సీఎం దంపతుల భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చత్తీస్‌గఢ్ గవర్నర్‌గా బదిలీ అయిన గవర్నరు విశ్వభూషణ్ హరిచందన్‌ను సోమవారం విజయవాడ రాజ్ భవన్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. హరిచందన్‌కు సీఎం వెంకన్న విగ్రహాన్ని బహుకరించారు. గవర్నరు దంపతులను వేర్వేరుగా సత్కరించారు. అనంతరం సీఎంను గవర్నరు శాలువా కప్పి సత్కరించారు.

హోంగార్డుల వయోపరిమితి పెంచాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు సిద్ధమవుతున్న హోం గార్డులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరహా వయోపరిమితి పెంచాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సమయం హేమంతకుమార్ డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు సోమవారం ఆయన వినతిపత్రం పంపారు. హోంగార్డు అభ్యర్థులకు గతంలో సచివాలయం ఉద్యోగార్థులకు ఇచ్చినట్లుగా అదనపు మార్కులు ఇచ్చి, వారికి న్యాయం చేయాలని కోరారు. సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు హోం గార్డులకు వేతన భత్యాలను పెంచి, పీఎఫ్, తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇటీవల ఏపీ ప్రభుత్వం నిర్వహించిన కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలు మూడు ప్రశ్నలకు జవాబులు లేనందున...అభ్యర్థులు అందరికీ తెలంగాణ తరహాలో మూడు మార్కులు వేయాలని కోరారు. ప్రశ్నాపత్రం పెద్ద ప్రశ్నలతో ఇవ్వడం వల్ల సమయం సరిపోకపోవడంతో చాలామంది అనర్హులయ్యారని తెలిపారు.

రక్షణ పరిశ్రమల పరంపర ప్రతిపాదన లేదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏదీ తమ వద్ద లేదని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందా? డిఫెన్స్ కారిడార్లకు సేవలందించే విధంగా ఎన్‌సీసీ కేడెట్లకు సాంకేతిక శిక్షణ అందించనున్నారా? డిఫెన్స్ కారిడార్లలో ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఏవైనా చేపట్టనున్నారా? ఉంటే వాటికి సంబంధించిన వివరాలు తెలపాలంటూ ఎంపీ విజయసాయి రెడ్డి సోమవారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా బదులిస్తూ ఎన్‌సీసీ కేడెట్లకు సాంకేతిక శిక్షణ ఇచ్చే ఆలోచన లేదని చెప్పారు. యువతలో సత్ప్రవర్తన, క్రమశిక్షణ, వివేకం, జ్ఞానం, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందించి తద్వారా వారు సమాజానికి నిస్వార్థమైన సేవలు అందించడంతో పాటు, రక్షణ దళాల వైపు మొగ్గు చూపే లక్ష్యంతోనే ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

వరల్డ్ ఇనిక్వాలిటీ నివేదికను నమ్మలేం: దేశ జాతీయ ఆదాయంలో టాప్ 1 శాతం కలిగిన ధనికులు 40 శాతం, టాప్ 10 శాతం కలిగిన ధనికులు 57 శాతం ఉంటే, దిగువనున్న 57 శాతం మంది ప్రజలు జాతీయ ఆదాయంలో కేవలం 13 శాతం మాత్రమే కలిగి ఉన్నారన్న వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్ట్-2022 గణాంకాలు వాస్తవమేనా? అని విజయసాయిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు ప్రణాళిక శాఖ సహాయ మంత్రి రావ్ ఇంద్రజిత్ సింగ్ సమాధానమిస్తూ ఆ నివేదికను నమ్మలేమని చెప్పారు. వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్టు -2022 నివేదిక సందేహాస్పదంగా ఉండడంతో దానిని పరిగణలోకి తీసుకోలేమని, ఆ నివేదిక ఆధారంగా కోరిన వివరాలపై వ్యాఖ్యానించలేమని మంత్రి తెలిపారు. దేశంలో పేదరికం, ఆర్థిక అసమానతలు తొలగించేందుకు, వీక్షిత్ భారత్ ఉద్దేశాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బ్యాంక్ అధికారుల వేధింపులు... రైతు ఆత్మహత్య



విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. బ్యాంక్ అధికారుల వేధింపులు తాళలేక తిమ్మాపురం గ్రామానికి చెందిన గంగుల రాటాలు(55) రైలు పట్టాల మీద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కుటుంబ సభ్యులను స్థానికులను తీవ్రంగా కలచివేసింది. తిమ్మాపురం గ్రామానికి చెందిన మద్దిపాటి సత్యన్నారాయణ అనే రైతు ద్వారకా తిరుమల స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ.3లక్షలు పంట రుణం తీసుకున్నాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన మృతుడు గంగుల రాటాలు మధ్యవర్తిగా జామీను సంతకం పెట్టాడు. మద్దిపాటి సత్యనారాయణ తీసుకున్న రుణం తిరిగి చెల్లించకపోవడంతో వడ్డీతో కలిపి అది రూ.5లక్షల 20వేలకు చేరింది. దీంతో మధ్యవర్తిగా ఉన్న రాటాలపై బ్యాంక్ సిబ్బంది ఒత్తిడి చేశారు. రుణం తీసుకున్న మద్దిపాటి సత్యన్నారాయణను తిరిగి చెల్లించమని రాటాలు అడిగినా, రుణం చెల్లించలేకపోయాడు. దీంతో మృతుని రాటాలు అకౌంట్లో వున్న రూ.28 వేలను బ్యాంక్ సిబ్బంది నిలిపివేశారు. మృతుడు తన చిన్నకుమార్తె జగదీశ్వరి క్యాన్సర్‌తో బాధపడుతోందని, ఆస్పత్రిలో చూపించాలి తన అకౌంట్‌లో ఉన్న డబ్బులు ఇవ్వమని బ్యాంక్ మేనేజర్ కాళ్లు పట్టుకుని ప్రాధేయపడినా పట్టించు కోకుండా గెంటివేశారు. ఆ సమయంలో బ్యాంక్‌లో ఉన్న వినియోగదారులు బ్యాంక్ మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన గంగుల రాటాలు శనివారం విజయవాడ వచ్చే రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని బంధువులు సోమవారం బ్యాంక్ ముందు మృతదేహాన్ని ఉంచి బ్యాంక్ మేనేజర్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో మృతుడి పేరుమీద ఉన్న రూ.2లక్షల లోను రద్దుచేసేలా చర్యలు తీసుకుంటామని బ్యాంక్ మేనేజర్ హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతునికి భార్య జ్యోతి, కుమార్తెలు భవాని, జగదీశ్వరి ఉన్నారు.

అమరావతి రాజధానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది: రుద్రరాజు

విశాలాంధ్ర-గుంటూరు: అమరావతి రాజధానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు, రావాల్సిన నిధులు ఇచ్చే విధంగా కృషి చేస్తుందన్నారు. గుంటూరు రాజీవ్‌గాంధీ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హోదా సాధించుకోవడంలో, నిధులు తెచ్చుకోవడంలో నాటి, నేటి రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ప్రైవేటు సంస్థలకు చెందిన విమానాల్లో విదేశీ పర్యటనలు చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారని మండిపడ్డారు. అదానీ చేతుల్లో మోదీ కీలుబొమ్మగా మారరని విమర్శించారు. ఎల్ఐసీ, ఎస్‌బీఐ సంస్థల నుంచి వేల కోట్లు దారిమళ్లించడంతో ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే ఈ అంశంపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వ దురాగతాలను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తూనే ఉందని, రైల్వే, విమానాశ్రయాలు తదితరాలను ప్రైవేటుపరం చేయడాన్ని ఖండిస్తూనే ఉందని చెప్పారు. సీబీఐ, ఈడీ, ఐటీ దాడుల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, చివరికి ముఖ్యమంత్రులను సైతం వదలడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన జాతీయ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టాన్ని కేంద్రం నీరుగారుస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, డీసీసీ అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు, గుంటూరు నగర అధ్యక్షుడు షేక్ ఉస్మాన్, గురున్నాథం, అయ్యప్ప, కొరివి వినయ్‌కుమార్, చందు సాంబశివుడు, జక్కా శ్రీను, షేక్ సలీం, చిలకా విజయ్, వణుకూరి శ్రీనివాసరెడ్డి, షేక్ కరీమ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆర్థిక, పారిశ్రామిక పురోగతి

సమాచార మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా, ఆర్థికంగా మంచి పురోగతి సాధిస్తోందని సమాచార, పౌర సంబంధాలు, బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న పటిష్ట ప్రణాళికల వల్లే ఇది సాధ్యమైందన్నారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నాల్గో బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో సోమవారం మంత్రి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రం పారిశ్రామికంగా మంచి పురోభివృద్ధి సాధిస్తూ...దేశంలోనే అత్యధిక పెట్టుబడులను ఆకర్షిస్తున్న రాష్ట్రంగా ముందుకు దూసుకెళ్తోందన్నారు. దేశంలోనే అత్యంత వేగంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందన్నారు. సంక్షేమ పథకాల అమల్లో దేశానికే ఆదర్శంగా రాష్ట్రం నిలిచిందనీ, భవిష్యత్ తరాల జీవితాల మార్పుకు పెట్టుబడే లక్ష్యంగా వివిధ వినూత్న సంక్షేమ పథకాలను రాష్ట్రంలో పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని నవరత్నాల పథకాలు అమల్లో భాగంగా రాష్ట్రంలోని పేదలందరికీ ఇప్పటి వరకూ దాదాపు రూ.1.92లక్షల కోట్ల పైనే సంక్షేమాన్ని అందించామన్నారు. సీఎం జగన్ మూడున్నరేళ్లలో వ్యూహాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలు, విధానాల వల్ల దేశంలోనే అత్యంత వేగంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్‌డీపీ 11.43శాతంగా నమోదై దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందడం ఇందుకు నిదర్శనమని స్పష్టంచేశారు. జాతీయ స్థాయిలో జీడీపీ 8.7శాతం నమోదవ్వగా, రాష్ట్ర జీఎస్‌డీపీ కేంద్ర జీడీపీ కంటే 2.73 శాతం అదనంగా నమోదైనట్లు వివరించారు. గత ప్రభుత్వ పాలనలో 2018-19ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌డీపీ కేవలం 5.36 మాత్రమే నమోదైన విషయాన్ని ప్రజలు గుర్తించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. డిపార్ట్మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ నివేదిక ప్రకారం 2022 జులై చివరి నాటికి దేశ వ్యాప్తంగా రూ.1,71,285 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, అందులో ఏపీ ఇతర రాష్ట్రాలతో పోటీపడి రూ.40,361 కోట్ల మేర పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించి అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి వివరించారు.

విజ్ఞాన్స్ వర్సిటీని సందర్శించిన కేంబ్రిడ్జి ప్రతినిధులు

విశాలాంధ్ర-గుంటూరు: ఇంగ్లండ్‌లోని ప్రతిష్ఠాత్మక కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రతి నిధులు గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీను సోమ వారం సందర్శించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రతినిధులకు పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేంబ్రిడ్జి యూనివర్సిటీ గ్లోబల్ ప్రొడక్ట్ మేనేజర్ ఇయాన్ కావ్‌లే మాట్లాడుతూ కేంబ్రిడ్జి ప్రస్తుతం నిర్వహిస్తున్న బెక్(బీఈసీ) కోర్సుకు బదులుగా కొత్తగా ప్రవేశపెట్టనున్న లింగ్వాస్కిల్స్ గురించి అధ్యాపకులకు వివరించి, దాని మీద అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విజ్ఞాన్స్ వర్సిటీతో తొమ్మిదేళ్లుగా వారికున్న అనుబంధాన్ని పంచుకోవడంతో పాటు కేంబ్రిడ్జి నిర్వహించే వివిధ పరీక్షల్లో విజ్ఞాన్స్ విద్యార్థులు చూపిస్తున్న ప్రతిభను కొనియాడారు. చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య సూచనల మేరకు రాబోయే రోజుల్లో విజ్ఞాన్స్ విద్యార్థులకు పరీక్షలతో పాటుగా స్పీకింగ్, కమ్యూనికేషన్ రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దడానికి వ్యక్తిగతంగాను, ఆన్‌లైన్ ద్వారా కూడా శిక్షణ ఇవ్వడానికి కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం విజ్ఞాన్స్ యూనివర్సిటీలో అమలులో ఉన్న కేంబ్రిడ్జి పాఠ్యప్రణాళికలు విద్యార్థుల్లో ఎంతమేర నైపుణ్యాలు అభివృద్ధి చెందుతున్నాయనే అంశంపై మరింత అధ్యయనం చేసి మెరుగైన విధి విధానాలను పొందుపరుస్తామన్నారు. కేంబ్రిడ్జి సౌత్ ఇండియా బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ శామ్యూల్ ఆనంద్‌రాజ్, సౌత్ ఆసియా బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ మనిష్ పూరి, విజ్ఞాన్స్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల కేంద్రం సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోరాటాలు, ఉద్యమాల నిర్మాణానికి కేంద్రంగా సీపీఎం రాష్ట్ర నూతన కార్యాలయం నిలుస్తుందని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఎ బేబీ, బీవీ రాఘవులు అన్నారు. విజయవాడ రాఘవయ్య పార్కు సమీపంలో నూతనంగా నిర్మించిన సీపీఎం రాష్ట్ర కార్యాలయాన్ని సోమవారం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులతో కలిసి సోమవారం ప్రారంభించారు. అంతకు ముందు పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు పి.మధు ఆవిష్కరించారు. బేబీ మాట్లాడుతూ పార్టీ కార్యాలయం ప్రజాతంత్ర, అభ్యుదయ ఉద్యమాలకు చైతన్య వేదిక అన్నారు. కేంద్రం నిరంకుశ విధానాలతో అన్ని రాష్ట్రాలూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. దేశం అదానీ, అంబానీ, మాఫియా చేతుల్లోకి వెళ్తోందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా పెద్దఎత్తున పోరాడాల్సిన అవసర ముందన్నారు. రాష్ట్రాల్లో అధికారాల కోసం బీజేపీ కుట్రలు చేస్తోందనీ, త్రిపురలో ఎన్నికలు జరుగుతుంటే అక్కడకు గుజరాత్‌తో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచి పోలీసు బలగాలను తీసుకొస్తున్నారని లెఫ్ట్ పార్టీల కార్యాలయాలను వారు టార్గెట్ చేశారని వివరించారు. గతంలో భద్రత కోసం బీఎస్ఎఫ్ సిబ్బంది వచ్చేవారని, ఇప్పుడు బీజేపీ పాలిత రాష్ట్రాల పోలీసులు రావడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. బీవీ రాఘవులు మాట్లా డుతూ రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం సూత్ర బద్ధ వైఖరితో పనిచేస్తోందని, రాష్ట్రం నేడు క్లిష్టమైన పరిస్థితుల్లో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్రంలో బలంగా లేకపోయినా ప్రధాన పార్టీల మెతకవైఖరితో అది పెత్తనం సాగిస్తోందన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా కలిసివచ్చే వారందర్నీ కలుపుకుని విస్తృత పోరాటాలు నిర్వహించాల్సిన అవసరముందని, మార్చిలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున రాజకీయ ప్రచారోద్యమం నిర్వహిస్తామని చెప్పారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వ రరావు, సీహెచ్.బాబూరావు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేయాలి

బడ్జెట్ పై అభ్యుదయ వేదిక చర్చా గోష్ఠిలో వక్తలు

విశాలాంధ్ర - తిరుపతి రూరల్: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి, వైద్య, విద్యారంగానికి పెద్దపీట వేయాలని ఆచార్య కంక జాల మునిరత్నం నాయుడు సూచించారు. అభ్యుదయ వేదిక అధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పై సోమవారం సాయంత్రం తిరుపతి బైరాగి పట్టెడలోని పిల్ల పాలెం వాసుదేవ రెడ్డి గ్రంథాలయంలో జరిగిన చర్చా గోష్ఠి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో వ్యవసాయం అతి ప్రధానమైన వనరని, కేంద్ర బడ్జెట్ లో రైతులకు సబ్సిడీ, గిట్టుబాటు ధర పై ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు జరగాలన్నారు. ప్రపంచ దేశాలు దేశాభివృద్ధి పై దృష్టి పెట్టాయనీ, ప్రపంచంలో త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ముందంజలో ఉందన్నారు. రైతులు అభివృద్ధి చెందాలంటే వ్యవసాయానికి నీరు, విద్యుత్, రుణసదుపాయం కల్పించాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ పై రాష్ట్ర బడ్జెట్ ఆధారపడి ఉంటుందని, రాష్ట్రాలు అభివృద్ధి చెందాలంటే కేంద్ర బడ్జెట్ చాలా అవసరమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 12% జనాభా తగ్గిందని, గ్రామాలలోని ప్రజలు ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్తున్నారని తెలిపారు. అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు ప్రొ॥ కేవీ రమణ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో ఆదాయం రెట్టింపు కాలేదని ఆ మేరకు కేంద్రం బడ్జెట్లో ఈ రంగానికి కేటాయింపులు పెంచలేదు అన్నారు. అభ్యుదయ వేదిక జిల్లా కోశాధికారి రేణుక, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళితదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్షులు గురవయ్య, కార్యదర్శి డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అడవిని నమ్ముకున్న ఆదివాసీలకు అన్యాయం

గిరిజన సంఘం మహాసభలో వక్తలు

విశాలాంధ్ర - వేలేరుపాడు: తరతరాలుగా అడవిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసి కుటుం బాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కారం దారయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఆగ్రహం వ్యక్తం చేశారు. చాకరపల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం మండల రెండవ మహాసభను పిట్టా వీరయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ విద్యా, వైద్యం, రహదారి తదితర కనీస వసతులు కూడా లేకుండా గిరిజన మండలాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయనీ, ప్రభుత్వాల నిర్లక్ష్యం వలనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. గిరిజనులపై ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ కురిపిస్తున్నాయని వారి అభివృద్ధికి నిధులు కేటాయించడమే గాని అవి సక్రమంగా ఖర్చు చేసిన పరిస్థితులు లేవన్నారు. గిరిజన చట్టాలు ఎన్ని ఉన్నా అవి పటిష్టంగా అమలకు ఏనాడు నోచుకోలేదన్నారు. సబ్ ప్లాన్ నిధులు కేటాయించటమే గాని సక్రమమైన పద్ధతుల్లో ఖర్చు చేయడం లేదని విమర్శించారు. అనేక తరాలుగా సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా కుంటి సాకులతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. పోడు భూములకు పట్టాల కోసం 900 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో 40 మందికి మాత్రమే పట్టాలు ఇచ్చి మిగిలిన వారికి పట్టాలు లేవన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా గిరిజనులకు ఒరిగిందేమీ లేదని ప్రభుత్వ చర్యలతో గిరిజనులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. రాష్ట్రానికి అనేక విధాలుగా ఉపయోగపడుతూ వెన్నెముకగా మారిన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వలన ఎక్కువగా గిరి జనులే నష్టపోతున్నా ఆ కుటుంబాలకు న్యాయం చేయటంలో ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరి స్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ముంపును 41, 45 కాంటూరు పరిధిగా విడగొట్టి అన్ని గ్రామాలకు పూర్తి ప్యాకేజీ అందించకుండా వందల గిరిజన కుటుంబాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. వందల కుటుంబాలను ప్యాకేజీకి దూరం చేశారని, ముంపు గ్రామాల అంచనాల్లో పూర్తిగా విఫలమయ్యారన్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్ల మీట్‌కు విస్తృత ఏర్పాట్లు: సీఎస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో మార్చి 3,4 తేదీల్లో జరగనున్న ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సుకు విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి చెప్పారు. సోమవారం అమరావతి రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాకు సీఎస్ సమావేశ మందిరంలో గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సుకు సంబంధించిన 3వ వర్కింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన సంబంధిత శాఖల అధికారులతో విస్తృతంగా చర్చించారు. అనంతరం జవహర్ రెడ్డి మాట్లాడుతూ రెండు రోజులపాటు జరగనున్న ఈ గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సుల్లో వివిధ సెక్టార్లపై పెద్ద ఎత్తున చర్చ జరగనుందని చెప్పారు. ముఖ్యంగా ఏరో స్పేస్ అండ్ డిఫెన్సు, అగ్రి అండ్ ఫుడ్ ప్రాసెసింగ్, ఏరోనాటికల్ అండ్ ఎలక్ట్రానిక్ వాహనాలు, హెల్త్ కేర్ అండ్ మెడికల్ ఎక్విప్మెంట్, ఇండస్ట్రియల్ అండ్ లాజిస్టిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పెట్రో అండ్ పెట్రోకెమికల్స్, రెన్యువబుల్ ఎనర్జీ, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్, టెక్స్‌టైల్స్ అండ్ అపారెల్స్, టూరిజం, స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రానిక్స్, స్టార్టప్స్ అండ్ ఇన్నోవేషన్, ఐటి అండ్ జీసీసీ వంటి రంగాలపై పెద్దఎత్తున చర్చ జరగనుందని, వీటిలో చర్చకు సంబంధించి ఇతర ప్రతినిధులతోపాటు ఇద్దరు అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొనేలా చూస్తున్నామన్నారు. ఈ సదస్సుకు సంబంధించి ఈనెల 14న బెంగుళూరు, 17న చెన్నై, 20న ముంబై, 24న హైదరాబాదులోనూ డొమెస్టిక్ రోడ్డు షోలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికల వలవన్, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా, చేనేత జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, ఐటిశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్, పరిశ్రమలు శాఖ అధికారులు, సీఐఐ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే వీడియో లింక్ ద్వారా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రజత్ భార్గవ, వై.శ్రీలక్ష్మి, కె.విజయానంద్, ముఖ్య కార్యదర్శి ఎంటి.కృష్ణ బాబు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ మల్లిఖార్జున, విశాఖపట్నం పోలీస్ కమిషనర్ పాల్గొన్నారు.

సంపాదకీయం

మాజీ న్యాయమూర్తులకు పదవుల పందారం

కొత్త గవర్నర్ల నియామకం, బదిలీలు పైకి చూస్తే సాధారణ వ్యవహారంగా కనిపించొచ్చు. పదవీ విరమణ చేసిన నెల రోజులు తిరక్కుండానే న్యాయమూర్తి అబ్దుల్ నజీర్‌ను ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా నియమించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన తరవాత రాజ్యసభ సభ్యత్వం స్వీకరించడానికి రంజన్ గొగోయ్‌కి మూడు నెలల సమయమైనా పట్టింది. కొత్త గవర్నరుగా నజీర్‌ను నియామకంలో అదీ లేదు. ఇదంతా చూస్తే తమకు అనుకూలంగా వ్యవహరించిన న్యాయమూర్తులకు ప్రభుత్వం అందించిన కానుక అనిపిస్తోంది. పదవీ విరమణ చేసిన న్యాయ మూర్తులను గవర్నర్లుగా నియమించడం కొత్త కాదు. 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకే న్యాయమూర్తి పి.సదాశివన్ ను కేరళ గవర్నరుగా నియమించారు. అప్పుడూ విమర్శలు ఎదురైనాయి. కానీ ప్రస్తుతం మోదీ ప్రభుత్వం న్యాయవ్యవస్థతో కయ్యం పెట్టుకుంటున్న రీతిలో వ్యవహరిస్తోంది కనక న్యాయమూర్తి నజీర్‌ను ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా నియమించడంలో రాజకీయకోణం బలంగా ఉందని పిస్తోంది. న్యాయమూర్తి నజీర్ ను గవర్నరుగా నియమించి మోదీ ప్రభుత్వం తాము ముస్లింలను విస్మరించడం లేదు అని చెప్పడానికి ప్రయత్నిస్తున్నట్టుగా అనిపిస్తోంది. రాజకీయ రంగంలో మోదీ హయాంలో ముస్లింలను సంపూర్ణంగా పక్కకు తోసేశారు. బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేయడానికి ఒక్క ముస్లింకు కూడా అవకాశం ఇవ్వడం లేదు. ఇంతకు ముందు ఉదాహరణప్రాయంగానైనా ముస్లింలు బీజేపీ తరఫున ఏదో ఓ పదవిలో ఉండేవారు. వారి సంఖ్య చాలా తక్కువే. ఇంతకు ముందు ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ, ఎం.జె.అక్బర్, సయ్యద్ జఫర్ ఇస్లాం వంటి వారు బీజేపీకి ప్రాతినిధ్యం వహించే వారు. వారి పదవీ కాలం ముగిసిన తరవాత వారి స్థానంలో ఒక్క ముస్లింకు కూడా బీజేపీ అవకాశం ఇవ్వలేదు. అంతే కాకుండా ఇటీవలి బడ్జెట్ లో అల్పసంఖ్యాక వర్గాలకు కేటాయించే బడ్జెట్‌లో 38 శాతం కోత పెట్టిన తరవాత బీజేపీ ముస్లింల విషయాన్ని పట్టించుకుంటుంది అని నమ్మడం అమాయకత్వానికి పరాకాష్ఠ. న్యాయమూర్తి నజీర్ ను గవర్నరును చేయడంవల్ల ముస్లింలకు చాలా చిన్న స్థాయిలోనైనా ప్రాతినిధ్యం ఇచ్చారనుకోవడానికీ అవకాశం లేదు. ఆయనను ఆంధ్రప్రదేశ్ గవర్నరును చేయడానికి ఇతరేతర కారణాలున్నాయి. అవి ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేవే. ఆయన మోదీ సర్కారుకు విధేయుడిగా ఉండి, ఆ ప్రభుత్వానికి అనుకూలమైన తీర్పులు ఇచ్చినందువల్లే గవర్నరు పదవి ఇచ్చినట్టు కనిపిస్తోంది. అయోధ్య కేసులో తీర్పు చెప్పిన అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నాయకత్వంలోని రాజ్యాంగ ధర్మాసనంలో న్యాయమూర్తి నజీర్ కూడా ఉన్నారు. ఆ తీర్పు సంఘ్ పరివార్‌కు పూర్తిగా అనుకూలంగా ఉందనడానికి ప్రత్యేక తెలివితేటలు అవసరం లేదు. ప్రభుత్వానికి అనుకూలమైన తీర్పులిచ్చిన న్యాయమూర్తులకు ఉద్యోగ విరమణ తరవాత కష్టపడకుండా వేతనం తీసుకునే పదవులు ఇవ్వడం మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు నుంచే ఉంది. తమకు మేలు చేసి ఉద్యోగ విరమణ చేసిన ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్., ఐ.ఎఫ్.ఎస్. అధికారులను ఏదో ఒక రూపంలో సత్కరించడం కూడా ఇంతకు ముందు కూడా ఉండొచ్చు. మాజీ సైనికాధికారులు కూడా ఉద్యోగవిరమణానంతర లబ్ధిని దృష్టిలో ఉంచుకునే పని చేస్తున్నారు. కానీ మోదీ హయాంలో ఈ పందారాల ప్రక్రియ మరింత వికృత రూపంలో వ్యక్తం అవుతోంది. అదృష్టవశాత్తు చాలా మంది న్యాయమూర్తులు ఉద్యోగానంతర పదవులు ఆశించకుండా పని చేసి ఉండొచ్చు. కానీ ఇలా ఆశపడడానికీ సుదీర్ఘచరిత్రే ఉంది. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరా గాంధీ న్యాయవ్యవస్థను లొంగదీయడానికి చేసిన పని వల్ల కలిగిన దుష్పరిణామాల నుంచి న్యాయవ్యవస్థ ఇప్పటికీ కోలుకోనే లేదు. పైగా ఇప్పుడు ఆ రుగ్మతకు చాలా ప్రమాదకరమైన హిందుత్వ వాదం తోడైంది. న్యాయమూర్తులు పదవిలో ఉన్నప్పుడు రాజ్యాంగానికి, పౌరులకు బాధ్యత వహించి పని చేయవలసిన అగత్యం లేదనీ, కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వానికి నిబద్ధమై పని చేస్తే ఉద్యోగ విరమణ తరవాత కూడా తృణమో పణమో దక్కుతుందన్న అభిప్రాయం ఈ రోజుల్లో న్యాయమూర్తుల్లోనూ బలంగా నాటుకు పోయింది.

న్యాయమూర్తిగా ఉన్నప్పుడు నజీర్ కొన్ని కీలకమైన తీర్పులు చెప్పిన బెంచీల్లో సభ్యుడిగా ఉన్నారు. అయోధ్య వివాదాన్ని విచారించిన బెంచి, ముమ్మారు తలాఖ్ కేసు విచారించిన బెంచి, గోప్యత హక్కు అని తీర్పు చెప్పిన బెంచిలోనూ ఆయన సభ్యుడిగా ఉన్నారు. వీటిలో చివరిది తప్ప మిగతా రెండూ ప్రభుత్వ అనుకూలమైన తీర్పులే. అయోధ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పూర్తిగా హిందుత్వ వాదులకు అనుకూలమైందే. ఆ బెంచిలో న్యాయమూర్తి నజీర్ ఒక్కరే ముస్లిం. ఆ తీర్పు ముస్లింల హక్కులను కాల రాసింది. వివాదాస్పదమైన అయోధ్య కేసులో చెప్పిన తీర్పు ఏకాభిప్రాయంతో కూడింది కావొచ్చు. కానీ న్యాయాన్యాలు ఏకాభిప్రాయం మీద ఆధారపడి ఉండవు. ఉండకూడదు. తలలు లెక్కించి న్యాయం ఏమిటో నిర్ధారించడం అంటే మెజారిటీ వర్గం ఆధిపత్యాన్ని అంగీకరించడమే. అయోధ్య తీర్పులో ఏకాభిప్రాయం కుదరడం సెక్యులరిజం విజయానికి ప్రతీక అని అంటున్న వారికి అది సెక్యులరిజాన్నే కాదు సహజ న్యాయాన్ని సైతం వెయ్యి నిలువుల లోతున పాతి పెట్టిందన్న వాస్తవం తెలియక కాదు. హిందుత్వ వాదం శిరోధార్యం అని భావించే వారు ఇలాంటి వాదనలే చేస్తారు. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత నుంచి, పౌరుల మౌలిక హక్కులను పరిరక్షించవలసిన బాధ్యత నుంచి న్యాయవ్యవస్థ క్రమంగా తప్పుకుంటున్న పోకడేలే ప్రబలంగా కనిపిస్తున్నాయి. ఈ మధ్యలో అక్కడో మెరుపు, ఇక్కడో మెరుపూ ఉండొచ్చుగాక. ప్రధాన న్యాయమూర్తిగా డి.వై. చంద్రచూడ్ బాధ్యతలు చేపట్టిన తరవాత న్యాయవ్యవస్థ స్వతంత్రతను పరిరక్షించే ప్రయత్నం చేస్తున్న జాడలు పొడసూపుతున్నాయి.

చంద్రచూడ్ పదవీ కాలం సాపేక్షికంగా ఎక్కువ కావడంవల్ల న్యాయవ్యవస్థ స్వతంత్రతను పరిష్కరించడం కుదురు తుందనుకోవడం అత్యాశ కాదు. కానీ ప్రధాన న్యాయమూర్తులుగా గొప్ప గొప్ప మాటలు చెప్పిన వారు కడకు సంఘ్ పరివార్‌కు అనుకూలంగానే తీర్పులు వెలువరించిన వాస్తవం మన కళ్లముందే ఉంది. రాజ్యాంగ మౌలిక స్వరూపంతో సహా న్యాయమూర్తులను నియ మించడానికి ప్రస్తుతం అమలులో ఉన్న కొలీజియం వ్యవస్థను మోదీ ప్రభుత్వం ఇసుమంతైనా బిడియం లేకుండా ప్రశ్నిస్తోంది. ఇది కేవలం కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు లేక ఉపరాష్ట్రపతి ధన్కర్ వ్యక్తిగత అభిప్రాయమో కాదు. వారి వాదనలను మోదీ సర్కారు ఖండించిన పాపాన పోలేదు కనక అది ప్రభుత్వ వైఖరే అనుకోవాల్సిందే. ఉద్యోగ విరమణానంతరం న్యాయ మూర్తుల సేవలు అవసరమైనరంగాలు ఉన్నాయి. వివిధ ట్రిబ్యునళ్లకు వారిని నియమించడంలో అర్థం ఉంది. అందులోనూ అనుకూల మైన వారిని నియమించడం ఎటూ ఉంటుంది. కానీ సంపూర్ణంగా రాజకీయ నియామకాలైన గవర్నరు పదవులలో మాజీ న్యాయమూర్తులను నియ మించడంలో కేవలం రాజకీయ కోణమే ఉంది. అధికార పార్టీ రాజకీయాలను ఆమోదించే వారికే ఈ పదవులు కట్టబెడ్తున్నారు. న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి, జీ హుజూర్ అనే వ్యవస్థగా మార్చడానికి ఉద్దేశపూర్వక ప్రయత్నమే జరుగుతోంది.

పెరూలో ఉధృతమైన నిరసనోద్యమం

కెన్ లివింగ్‌స్టోన్

తిరుగుబాటుతో అధికారానికి వచ్చిన పెరూ అధ్యక్షుడు బినా బొలుర్టెకు వ్యతిరేకంగా నిరసనోద్యమం తీవ్రతరమైంది. రాజధాని లిమానగరంతో సహా దేశంలోని 11అతిపెద్ద పరిపాలనా ప్రాంతాలలో ఉద్యమం కొనసాగుతోంది. ఉద్యమాన్ని అణచివేసేందుకు ఏడు ప్రాంతాలలో అత్యవసర పరిస్థితిని విధిస్తూ అధ్యక్షుడు డిక్రీ జారీ చేశారు. ప్రభుత్వ వ్యతిరేక నిరసన ప్రదర్శనలు రోజురోజుకు విస్తృత మవుతున్నాయి. నిరసన కార్యక్రమాల్లో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొంటూ దేశంలో తిరిగి ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడాలని నినాదాలు చేస్తున్నారు. ఎమర్జెన్సీని విధించి మౌలిక రాజ్యాంగ హక్కులపైఆంక్షలు విధించారు. ప్రజలు స్వేచ్ఛగా తిరిగేందుకు వీలులేదు, ఎక్కడా గుమికూడరాదు, వ్యక్తిగత స్వేచ్ఛ, భద్రత లేదు. ఒక నియంత ప్రభుత్వంలో ఎక్కడైనా ఇలాగే ఉంటుందన్నది దేశాధ్యక్షుడు నిరూపించాడు. ఎన్నికలలో గెలిచి దేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని నెలకొల్పిన అధ్యక్షుడు పెడ్రో క్యాజిలోపై తిరుగుబాటు జరిపి ఆయనను పదవి నుంచి తప్పించారు. లాటిన్ అమెరికాలో అనేక దేశాలలో ఏర్పడిన వామపక్ష భావజాలం కలిగిన ప్రభుత్వాలు పెరూ ప్రజాస్వామ్య ఉద్యమానికితోడ్పాటును ప్రకటించగా అమెరికా తదితర ప్రభుత్వాలు తిరుగుబాటును సమర్థించాయి. క్యాజి లోను అరెస్టుచేసిన తరువాత పెరూలో తమ రాయబార కార్యాలయా నికి రావలసిందిగా మెక్సికో అధ్యక్షుడు అమ్‌లో ఆయనను ఆహ్వానించారు. అయితే అప్పటికే పోలీసులు వచ్చి క్యాజిలోను అరెస్టు చేశారు. ఆ తరువాత పార్లమెంటు (కాంగ్రెస్) ఓడిపోయిన మాజీ అధ్యక్షుడు బొలుర్టెని దేశాధ్యక్షుడిగా ప్రకటించింది.

క్యాజిలో గతంలో స్కూలు టీచరుగా పనిచేశారు. పెరూ గ్రామీణ ప్రాంతాల్లో యూనియన్ నాయకుడిగా ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర ఉంది. 2021 లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో మితవాద నాయకుడు కెయికో ఫ్యుజిమొరితో ఎన్నికల్లో పోటీచేసి 45 వేల ఓట్లతో విజయం సాధించారు. పరిపాలన చేపట్టిన గత 18 నెలలుగా ఆయనను అధికారం నుంచి తప్పించాలని మితవాద శక్తులు రకరకాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. ఈ ప్రయత్నాల వెనుక అనేక దేశాలలో తిరుగుబాటు శక్తులను ప్రోత్సహించే అమెరికా పెరూలోను అదే పనిచేసింది. డిసెంబరు 7వ తేదీన తిరుగుబాటు ద్వారా మిత వాద శక్తులు అవినీతి ఆరోపణలు చేసి బొలీవియాలో గతంలో జరిగి నట్టుగానే ఇక్కడ కూడ అధ్యక్షుడిని పదవి నుంచి బలవంతంగా దింపి వేశారు. పచ్చి మితవాద శక్తుల ఆగడాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగిన వెంటనే ప్రజలుఉద్యమం ప్రారంభించి నలుమూలలా వ్యాపింప చేశారు. ఇప్పుడు ఉద్యమం మరింత బలోపేతమయింది. పోలీసులు, సైనికులు తీవ్ర దమనకాండకు పాల్పడుతున్నారు. వీరి దౌర్జన్య కాండలో కనీసం 70 మంది మృతిచెందారు. అనేక వేల మంది గాయపడ్డారు. పోలీసులకు, ప్రదర్శనకారులకు దేశ వ్యాప్తంగా అనేక చోట్ల ఘర్షణలు జరిగాయి. తక్షణం బొలుర్టె రాజీనామా చేయాలని జైలులో పెట్టిన క్యాజిలోను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే పార్లమెంటును రద్దుచేసి తాజాగా వీలైనంత త్వరగా అధ్యక్ష పదవికి ఎన్నికలునిర్వహించాలని డిమాండ్‌చేస్తున్నారు. అలాగే పెరూను ప్రజాస్వామ్య దేశంగా ప్రకటించేందుకు రాజ్యాంగ అసెంబ్లీని ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు. దేశంలో జాతి, వర్గం, రాజకీయవాతావరణం అత్యంత ప్రగాఢంగా అసమానతలను పెంచాయి.

తిరుగుబాటుకు వ్యతిరేకంగా జరుపుతున్న ఆందోళనల్లో పాల్గొనే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. పోలీసులు, సైనికులు కలిసి హతమార్చిన ప్రదర్శనకారుల కుటుంబాలకు న్యాయంచేయాలని డిమాండ్ చేస్తున్నారు. నిరసకారులపై పోలీసులు దమనకాండ జరుపుతూ హింసిస్తున్నారని పెరూ కార్మికుల జనరల్ కాన్ఫెడరేషన్ సహాయ ప్రధాన కార్యదర్శి గుస్తావ్ మినయ విమర్శించారు. అలాగే పోలీసులను రెచ్చగొడుతూఉద్యమాలకు వ్యతిరేకంగా వార్తలు అందిస్తున్న జాతీయ, అంతర్జాతీయ మీడియాను ఆయన తీవ్రంగా ఖండించారు.

బడ్జెట్‌లో నిరుద్యోగులకు చోటేది?

సుబోధ్ వర్మ

యువతదే భవిష్యత్. వారు ఆధునిక భారత నిర్మాణంలో ప్రధానపాత్ర అని రోజూ ఊదరగొట్టే బీజేపీ నాయకత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో చోటు లేకుండా చేసింది. రోజురోజుకీ పెరుగుతున్న నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి ప్రయత్నించకపోగా ప్రజల జీవనం, జీవన భృతిపైన 2023-24 బడ్జెట్ తీవ్రమైన దెబ్బ కొట్టింది. ప్రజలకు నేరుగా ఆర్థిక ప్రయోజనాలు దక్కే పథకాలు, స్కీములకు కేటాయింపులను గణనీయంగా తగ్గించారు. ప్రజలు కీలకమైన సమస్యలను పట్టించుకోలేదు. ముఖ్యంగా నిరుద్యోగం, అందునా యువతను నిర్లక్ష్యం చేస్తున్నారు. గత 41 నెలల్లో నిరుద్యోగం 7శాతానికి అటూఇటూగా ఉంటోందని పీఎంఐఇ సర్వే తెలియజేసింది. పట్టణ నిరుద్యోగం 8-10శాతం ఉందని, ఇది కొనసాగు తూనే ఉందని సర్వే తెలియజేసింది. ప్రభుత్వం దీన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్లనే ఈ దుస్థితి ఏర్పడింది. గత మూడు సంవత్సరాలుగా ఒకే విధంగా ఉంది. 2020లో 41.1శాతం ఉండగా, అది అలా కొనసాగుతోంది. కరోనా మహమ్మారికి ముందున్న 40.9శాతం నిరుద్యోగం 2023లోనూ నమోదైంది. అయితే కార్మికులకు, ప్రత్యేకించి పనులు చేసేవారు లేదా పనులకోసం వెదికేవారి సంఖ్య 42.9శాతం నుండి 38శాతానికి గత మూడేళ్లలో తగ్గింది. ఒకవైపు జనాభా పెరుగుతున్నది, అదే సమయంలో ఉద్యోగాల సృష్టి పెరగడంలేదు. కార్మికులు సైతం విసుగుచెంది శ్రామికులు మార్కెట్‌లోకి రావడం తగ్గింది. దీని అర్థం జీవన ప్రమాణాలు పడిపోయాయి.

పరిస్థితులు ఇంత దారుణంగా ఉన్నప్పటికీ ప్రధాని మోదీ మాత్రం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామన్న నినాదాన్ని వల్లెవేస్తూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వంలో గల ఉద్యోగాల ఖాళీలు పది లక్షలున్నాయని త్వరలో పూరిస్తామని వాగ్దానాలు గుప్పిస్తూనే ఉన్నారు. నిరుద్యోగ సంక్షోభాన్ని పరిష్కరించడానికి అవసరమైన విధానాన్ని కేంద్రం రూపొందిస్తుందన్న ఆశతో నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం అమలు జరుగుతున్న ముఖ్యమైన పథకాలకు నిధులను తగ్గించివేశారు. వీటిలో ప్రధానమైంది

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం. దీనికి 33శాతం నిధులను కోసివేశారు. 2022-23లో సవరించిన అంచనాల ప్రకారం, 9,400 కోట్లు కేటాయించగా, 2023-24లో 60వేల కోట్లు మాత్రం ఇస్తారు. జాతీయ జీవన భృతి మిషన్‌కు తగ్గించారు. నేరుగా ఉపాధికల్పన పథకాలు ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం, స్వచ్ఛ భారత్ మిషన్, ఇతర సంక్షేమ పథకాలకూ తగ్గించారు. ఐసిడిఎస్‌కు నిధులు ఏమాత్రం పెంచలేదు. ఉద్యోగాల సృష్టికి బడ్జెట్‌లో నిధులు కల్పిస్తామని ప్రభుత్వం, దాని వందిమాగధులు విపరీతమైన భ్రమలను కల్పిస్తూ ప్రచారం సాగించారు. అలాగే ప్రభుత్వం మూలధనం ఖర్చును పెంచుతుందని,దాని వల్ల కొత్త ఉద్యోగాలు లభిస్తాయని కూడా చెప్పారు. మౌలిక సదుపాయాల ఏర్పాటుపైన ఖర్చుచేస్తే వచ్చే ఉద్యోగాలకంటే విద్య, ఆరోగ్యరంగాల మీద ఖర్చుచేస్తే ఉద్యోగాలు ఎక్కువగా లభిస్తాయి. అయినప్పటికీ వీటికి ప్రాధాన్యత నివ్వడంలేదు. విశ్వవిద్యాలయాల్లో సైతం ఖాళీలు నింపకుండా సంవత్సరాల తరబడికాలం గడుపుతున్న పరిస్థితి నెలకొని ఉంది. అన్ని అర్హతలుండి ఉద్యోగాలకోసం దరఖాస్తుచేసినా వాటిని పెండింగ్‌లోపెట్టి మౌనంగా ఉంటున్న సందర్భాలు అనేకం. విదేశీయాత్ర పరికరాలను దిగుమతి చేసుకొనేందుకు అధికంగా నిధులు ఖర్చు చేస్తున్నారు. దీనివలన స్థానిక ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. అదే సమయంలో స్థానికులకు ఉద్యోగాలు లభించవు.

మరో భ్రమను కూడా ప్రచారంలో పెట్టారు. బ్యాంకులు రుణాలివ్వడం పెరిగితే ఉత్పత్తి శక్తి పెరుగుతుందని, ఫలితంగా ఎక్కువ ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. గత అనేక సంవత్సరాలుగా మనం పొందిన అనుభవాన్నిచూస్తే ఇది భ్రమో అర్థమవుతుంది. కార్పొరేట్ రంగానికి ప్రోత్సాహకాల పన్ను రాయితీలు, తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చినప్పటికీ ఉద్యోగాలు మాత్రం పెరగడంలేదు. ఈ మార్గంవల్ల ఎలాంటి ప్రయోజనంలేదని తేలింది. లిస్టెడ్ కంపెనీలు కరోనా మహమ్మారి కాలంలోనూ అపార లాభాలను పొందాయి గానీ ఉద్యోగాలు రాలేదు. పనులు, ఉద్యోగాలు కోల్పోయిన కోట్లాదిమంది కొనుగోలుశక్తి సన్నగిల్లి వస్తువుల డిమాండ్ పడిపోయింది. ఇలాంటి పారిశ్రామిక వేత్తలకిచ్చే రాయితీలు, సబ్సిడీల మూలంగా వారి లాభాలు పెరుగుతాయి.

ఇక సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమలకు తగిలిన దెబ్బలతో అవి కుదేలయ్యాయి. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ పన్నుల వ్యవస్థ, అనంతరం కరోనా మహమ్మారి ఇవన్నీ కలిసి ఈ పరిశ్రమలు మళ్లీ కోలుకోకుండా చేశాయి. దేశంలో 6.33 కోట్ల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలుండగా, 6.30 కోట్లు(99శాతం) సూక్ష్మ పరిశ్రమలు, 3.31 లక్షల చిన్న, 5వేలు మధ్య తరహా పరిశ్రమలున్నాయి. ఈ విషయాలు ప్రభుత్వానికి స్పష్టంగా తెలుసు. సూక్ష్మ పరిశ్రమల్లో దాదాపు 11కోట్ల మంది కార్మికులు, చిన్న తరహా పరిశ్రమలు 32 లక్షలు, మధ్యతరహా పరిశ్రమల్లో కేవలం 2లక్షల మందే ఉన్నారు. సూక్ష్మ పరిశ్రమలతో ఈ పరిశ్రమలన్నిటికీ సహాయంచేస్తే ఎక్కువ ఉద్యోగాలు వస్తాయి. 2022 ఆర్థిక సంవత్సరం చివరి మూడునెలల్లో, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు రూ.2.57 లక్షల కోట్లు రుణాలిస్తే, సూక్ష్మ పరిశ్రమలకు 68.9 వేల కోట్లు మాత్రమే రుణాలిచ్చారు. మోదీ ప్రభుత్వం గుడ్డిగా నయా ఉదార విధానాలు అనుసరిస్తూ బడావ్యాపారులు, పరిశ్రమలు, ఇతర దేశాల సంస్థలకు సహాయ చేయడం వల్ల ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందడంలేదు. అధిక ఉద్యోగాలు లభించడంలేదు.

ఆవులు-అపోహలు, అవాస్తవాలు



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

ఫిబ్రవరి 14న ప్రేమికుల రోజు ఆవుల ఆలింగనోత్సవంగా సంబరించుకొమ్మని భారత పశు సంవర్ధక శాఖ ఆదేశించింది. మాధ్యమాల్లో పెల్లుబికిన ప్రజల అసంతృప్తిని, నిరసనలను గమనించి ఈ ఆదేశాలను రద్దుచేసింది. మోదీ సర్కార్ ఆవుకు ఆపాదించిన అపోహలను, అవాస్తవాలను తెలుసుకుందాం. జీవులు తిన్న ఆహారాన్ని జీర్ణించుకుంటాయి. శారీరక, జీవావసరాలు తీర్చుకుంటాయి. వ్యర్థాలను విసర్జిస్తాయి. వ్యర్థాల్లోని ఆమ్లాలు, క్షారాలకు, ఔషధంగా పనికిరాని, కొంత ఔషధ గుణం ఉండచ్చు. విసర్జితాలు పశుపక్షులకు ఆహారంగా, వంటచెరుకుగా, ఎరువుగా ఉపయోగపడచ్చు. పశువుల, పక్షుల వ్యర్థాలకు, అవి తిన్న తిండిని బట్టి కొద్ది తేడాలతో, ఒకే గుణాలుంటాయి. ఆవుల, ఎద్దుల, గేదెల, దున్నల వ్యర్థాల్లో తేడాలుండవు. ఏ జంతు వ్యర్థాలకూ ప్రత్యేకత, పవిత్రతలుండవు.

ఆవు మలమూత్రాలు అద్భుత పదార్థాలని వెగటుపుట్టించే మూఢవిశ్వాసాలు ప్రచారంలో ఉన్నాయి. మోదీ బిజెపి ప్రభుత్వంలో ఈ ప్రచారం పెరిగింది. సంఘ్ ప్రచారకులు, ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులు గోవిసర్జనల పవిత్రతల గురించి డబ్బాకొడుతున్నారు. శాస్త్రజ్ఞులను, విజ్ఞానశాస్త్రాన్ని అవమానిస్తున్నారు. ఆవు పవిత్రమని హిందువాద ఆలోచన. ఆవులు పరిపుష్ట ఆహారమైన పాలిస్తాయి. మనుషులు, గేదెలు, మేకలు, గొర్రెలు, గాడిదలు కూడా పాలిస్తాయి. ఆవు పాలలో బంగారం ఉంటుందన్నది మూర్ఖత్వం.గోపవిత్రతఅశాస్త్రీయం.ఇదిశూన్యాకాశం తీపా,చేదా అన్నట్లుంది. సంప్రదాయాన్ని తర్కించి, పరీక్షించి, ప్రయోగించి నిజాలు నిర్ధారించాలి. సంప్రదాయం పేరుతో ప్రచారంచేసిన అపోహలను, మత తాత్విక భావజాలాన్ని బయటపెట్టాలి. సంప్రదాయవిశ్వాసాలు, సామాజిక ఆచరణల అవాస్తవాలను విజ్ఞానశాస్త్ర సత్యాలతో తుడిచేయగల శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి. దీనికిఆధారమైన ప్రశ్న, వివేకం విద్యాలయాల ప్రాథమిక లక్షణాలు.

కొందరు "శాస్త్రజ్ఞులు" సేంద్రీయ వ్యవసాయానికి ఆవు పేడాపంచితాలే కావాలని ప్రచారంచేస్తారు. సంప్రదాయం, విశ్వాసాలలో ఆర్థిక, సామాజిక కొలమానాలు సమర్థనీయాంశాలు. సేంద్రీయ వ్యవసాయంలోనూ ఇది వర్తిస్తుంది. సేంద్రీయ సుస్థిర వ్యవసాయ పద్ధతులు గోమూత్ర ఉపయోగంపై విస్తార సంప్రదాయ విశ్వాసాన్ని ప్రచారంచేశాయి. గోమూత్రంలో విభిన్న పదార్థాలను, వివిధ పరిమాణాలలో, పద్ధతులలో కలిపి వృక్ష పోషకాలయిన 'అమృతాలను', వృక్ష సంరక్షక పదార్థాలయిన 'అస్త్రాలను' తయారుచేస్తారు. ఉదాహరణకు వేపాకు వంటి5 విషపూరిత ఆకులను నియమిత కొలతలలో గోమూత్రంలో కలిపి ఉడికిస్తారు. దీన్ని పంచగవు అంటారు. ఈ కషాయ మిశ్రమాన్ని నీళ్ళు కలిపి పలచగా చేసి, క్రిమిసంహారిణిగా చెట్లు, పంటలపై చల్లుతారు. గోమూత్రంలో ప్రత్యేకమైన, ఏకైక లక్షణాలను ఆపాదించే పదార్థాలుంటాయని సంప్రదాయవాదులు వాదిస్తారు. ఎద్దుల, గేదెల, దున్నల,ఆవు మూత్రాలకుఒకే లక్షణం ఉంటుంది. నష్టదాయక వ్యవసాయంలో పశువుల మేత తగ్గి పశువులే తగ్గిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆవుల సంఖ్య తగ్గింది. పట్టణాల్లో ఆవులు చెత్త కుండీల్లో చెత్త తిని అనారోగ్యం పాలవుతున్నాయి. రోడ్లపైనే తిరుగుతున్నాయి. పడుకుంటున్నాయి. ఆవులు మా మాతలని ప్రచారంచేసే ప్రవక్తలకు వీధిగోవులు కనిపించవు. గోహింస పుకార్లతో గోగూండాలు తోటివారిని చంపుతున్నారు. అమృతాల, అస్త్రాల తయారి మానేస్తారు కానీ ఎద్దుల, గేదెల, దున్నల మూత్రాలతో వాటిని తయారుచేయరు. గ్రామీణ 'వ్యాపారులు' సంప్రదాయవాద రైతులకు గోమూత్రాన్ని అమ్ముతున్నారు. ఆవులు తగ్గిన నేటి పరిస్థితులలో వారికి ద్రమ్ముల కొద్ది గోమూత్రం ఎక్కడిది? ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ ఆధునీకరణ యంత్రాలను సేంద్రీయ వ్యవసాయ శత్రువులుగా చూస్తారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో గోమూత్ర వ్యాపారం బాగా సాగుతోంది. మధ్యప్రదేశ్, బుర్హాన్పుర్ జిల్లా, ఖాక్నర్ బ్లాక్, సాతోడ్ గ్రామం మూత్ర వ్యాపారానికి ప్రధాన కేంద్రం. ఇక్కడ గోమూత్ర వ్యాపారం, "సేంద్రీయ" వ్యవసాయం పెద్ద ఎత్తున సాగుతున్నాయి. లీటరు గోమూత్రం రూ.10లకు అమ్మి గోమూత్ర వ్యాపారులు కోట్లు గడించారు. బర్వాణి జిల్లా బాలవాడి బ్లాక్ లో ఆవు ఉత్పత్తుల, ఎరువుల వ్యాపారం బాగా జరుగుతోంది.

పాడి పంటల గ్రామీణ వాతావరణంలో గేదెల సంచారం

3 నెల్ల పంట సీజన్ లో ఒక వ్యాపారి సగటున 25 కిలోల ఎరువుల సంచులు 3,000 పైగా అమ్ముతాడు. రూ.75,000 లు మించి సంపాదిస్తాడు. ఈ ఎరువు తయారి సమయంలో చాలా దుర్వాసన వస్తుంది. హిందువాద రైతులు కూడా ఈ దుర్వాసనను భరించలేరు. ఈ ఎరువును తయారు చేసుకోరు. వ్యాపారులు ఈ గోమలమూత్ర ఎరువుల తయారీలో మహిళలు, దళితులతో వెట్టిచాకిరి చేయించుకుంటారు. ఇక్కడ కూడా బహుళజాతి సంస్థల స్థాయిలో పద్ధతులలో స్త్రీల, దళితుల దోపిడీ జరుగుతోంది. దేశీ ఆవుల మూత్రమే వాడాలని, దేశీ ఆవుల పాలే తాగమని విస్తృత ప్రచారంచేశారు. ఈ అనైతిక వ్యాపారంలో కొనలేనివారు సేంద్రీయ వ్యవసాయం మానేశారు.

మనుష్య, పశుపక్ష విసర్జనలు కూడా ఆధారపడదగ్గ, నమ్మదగ్గ వనరులే. ఎరువులు, క్రిమిసంహారాల తయారీలో గోమలమూత్రాలకు బదులు ఎద్దుల, దున్నల, గేదెల, గొర్రెల, మేకల, గాడిదల, మనుషుల మలమూత్రాలనువాడాలి. అదే పద్ధతులలో అమృతాలు, అస్త్రాలు తయారుచేయాలి. ఇవి కూడా బాగా పనిచేస్తాయని రుజువులున్నాయి. పంది పెంట మంచి ఎరువుగా పనిచేస్తుంది. గుజరాత్ ఆదివాసీ ప్రాంతాల్లో గిరిజనులు బయోగ్యాస్ ప్లాంట్లలో ఆవు పేడతో పాటు మానవమలశేషాలనూ వాడుతారని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసిన ఒక సుప్రసిద్ధ సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి, మేనేజ్మెంట్ ప్రొఫెసర్ అన్నారు. వ్యవసాయంలో గోమలమూత్ర ఉపయోగాన్ని బడ్జెట్ లో ప్రస్తావించిన కేంద్ర ఆర్థిక మంత్రి, సముచిత శాస్త్రీయ ప్రయోగాలతో, పనులతో, మద్దతుతో ఆ ప్రక్రియలను వివరించాలి. ఇతర జంతువుల, పక్షుల, మనుషుల విసర్జనల ప్రత్యామ్నాయ ఉపయోగాన్నీ, ప్రయోజనాలనూ ప్రోత్సహించాలి. వ్యవసాయ పరిశోధన భారతీయ మండలి (ఐసిఎఆర్) లో నినాదాలిచ్చిన మోదీ ఈ మండలిలో, ఈ రంగంలో అధ్యయనాలకు, పరిశోధనలకు అవకాశం కల్పించాలి. నిధులు కేటాయించాలి. భావజాల తాత్వికతల ఊగిసలాటలకు స్వస్తిపలకాలి.

ఉత్తర ప్రదేశ్, ఉత్తర బిహార్ ప్రాంతాల్లో, కోల్కత నగరంలో పేడ పిడకలను వంటచెరుకుగా వాడతారు. స్త్రీలు పేడ సేకరించి, పిడకలు చేసి ఎండబెట్టి పిడకల బట్టీలు పేర్చుతారు. అననుకూల కాలాల్లో వంటచెరుకు కోసం అనుకూల సమయాల్లో ఈ పనులు చేస్తారు. పిడకలను మంచి ధరకు అమ్ముకుంటారు. పిడకల తయారీలో ఆవు పేడ మాత్రమే కావాలని అనుకోరు. గేదెల పేడనే వాడతారు. పిడకల తయారి మన రాష్ట్రంలోనూ ఎక్కువే. స్వచ్ఛ భారత్ నేపథ్యంలోనూ



ప్రాచీన గ్రామ విహంగ వీక్షణం

గ్రామాల్లో నేటికీ బహిరంగ మలవిసర్జన జరుగుతోంది. ఈ వ్యర్థాలు పంటలకేకాక బయోగ్యాస్ ఉత్పత్తికీ ఉపయోగించ వచ్చు. ఈ వంటగ్యాస్ 'ప్రధాన మంత్రి ఉజ్వల' పథకానికి సంపూరకం కాగలదు. దీపాలకూ ఉపయోగపడుతుంది. గ్రామాల్లో వంట గ్యాస్, విద్యుత్ కొరతలు, రైతుల వ్యవసాయ అవసరాలు తీరుతాయి. గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్ల వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో బయోగ్యాస్ ప్లాంట్లకు సరఫరా చేయచ్చు. ఉపాధి హామీ పథకంలో ఉపాధి కల్పించవచ్చు. బెజవాడ విల్సన్, ఆసిఫ్ షేక్ వగైరాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా దళితులకు మానవ మలశుద్ధి పనులు తప్పలేదు. ఈ శ్రమజీవుల బతుకులు బాగుపడలేదు. మానవ వ్యర్థాల బయోగ్యాస్ పథకాలతో వీరికికొంత ఊరట కలగవచ్చు. 'మానవ మలశుద్ధి మానవులే చేయటం' వారి పూర్వజన్మ కర్మ ఫలితమన్నమోదీపాలనలో ఇంత కంటే గొప్ప సౌకర్యం సమకూరదు. ఆధారపడదగ్గ, నమ్మదగ్గ వనరులను ప్రభావవంతంగా వాడితే సేంద్రీయ వ్యవసాయం, సుస్థిర ప్రగతి సుసాధ్యం. పుక్కిటిపురాణాల, కట్టుకథల, మతమౌఢ్యం వదలాలి. విజ్ఞానశాస్త్రాన్నే నమ్మాలి. విశ్వాసాలు, సంప్రదాయాలపై విచక్షణనుకేంద్రీకరిస్తే మూఢనమ్మకాల, దుస్సంప్రదాయాల నిర్మూలన సులభం.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
చరవాణి: 9490204545

జమ్ముకశ్మీర్ పునర్విభజనకు సమర్థన

పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కేంద్ర పాలిత ప్రాంతంలోని శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం 'డీలిమిటేషన్ కమిషన్'ను ఏర్పాటు చేయాలన్న కేంద్రం నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలయిన పిటిషన్‌ను కొట్టివేస్తూ జమ్ముకశ్మీర్ డీలిమిటేషన్‌పై కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని సుప్రీంకోర్టు సోమవారం సమర్థించింది. ఆర్టికల్ 370కి సంబంధించిన అధికార వినియోగం చెల్లుబాటు అనేది సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లకు సంబంధించిన అంశం అని కూడా కోర్టు గమనించింది. ఇద్దరు కశ్మీర్ వాసులు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు ఎస్.కె.కౌల్, ఎ.ఎస్.ఓకాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. ఈ తీర్పులో రాజ్యాంగంలోని ఆర్టికల్ 370లోని ఒకటి, మూడు నిబంధనల ప్రకారం అధికారాన్ని వినియోగించుకోవడానికి ఏదీ అన్యాయం చేసినట్లుగా భావించరాదని తీర్పును ప్రకటిస్తున్నప్పుడు జస్టిస్ ఓకా అన్నారు. ఆగస్టు 5, 2019న ఆర్టికల్ 370లోని నిబంధనలను రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలయిన పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం స్వాధీనం చేసుకుంది. ఆర్టికల్ 370, జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019 నిబంధనలను రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. ఇది జమ్ముకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలు - జమ్ముకశ్మీర్, లడఖ్‌గా విభజించింది. ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసింది. డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలయిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గత ఏడాది డిసెంబరు 1న తన తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. గత ఏడాది డిసెంబర్ 1న విచారణ సందర్భంగా, జమ్ముకశ్మీర్‌లోని శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాలను పునర్నిర్మించేందుకు ఏర్పాటు చేసిన డీలిమిటేషన్ కమిషన్‌కు అలాంటి అధికారం ఉందని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరుతూ, కేంద్రం తరపున హాజరయిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా... జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019 కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయడాన్ని నిరోధించదని వాదించారు. మార్చి 6, 2020న, కేంద్ర న్యాయ, న్యాయ మంత్రిత్వ శాఖ (లెజిస్లేటివ్ డిపార్ట్‌మెంట్) డీలిమిటేషన్ చట్టం-2002లోని సెక్షన్ 3 ప్రకారం, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజన ప్రకాష్ దేశాయ్ చైర్‌పర్సన్‌గా డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. హాజీ అబ్దుల్ గనీ ఖాన్, మహ్మద్ అయూబ్ మట్టూ అనే ఇద్దరు పిటిషనర్ల తరపు న్యాయవాది వాదిస్తూ, రాజ్యాంగ పథకానికి విరుద్ధంగా డీలిమిటేషన్ కసరత్తు జరిగిందని, సరిహద్దుల మార్పు, విస్తరించిన ప్రాంతాలను చేర్చడం వంటివి చేయరాదని వాదించారు. జమ్ముకశ్మీర్‌లో సీట్ల సంఖ్యను 107 నుంచి 114కి (పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని 24 సీట్లతో సహా) పెంచడం రాజ్యాంగపరమైన, చట్టబద్ధమైన నిబంధనలకు విరుద్ధమని, ముఖ్యంగా జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 63 కింద ప్రకటించాలని పిటిషన్ కోరింది. 2001 జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్ చట్టం-2002లోని సెక్షన్ 3 ద్వారా అందించబడిన అధికారాల ప్రకారం జులై 12, 2002న చివరిగా డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. రాజ్యాంగ, చట్టపరమైన నిబంధనలతో పాటు జులై 5, 2004 నాటి లేఖ ద్వారా అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల విభజన కోసం కమిషన్ మార్గదర్శకాలు, పద్ధతులన జారీ చేసిందని పిటిషన్ పేర్కొంది. '1971 జనాభా లెక్కల ఆధారంగా నిర్ణయించబడిన జాతీయ రాజధాని ప్రాంతం, పాండిచ్చేరిలోని కేంద్ర పాలిత ప్రాంతాలతో సహా అన్ని రాష్ట్రాల శాసనసభలలో ఉన్న మొత్తం సీట్ల సంఖ్య 2026 సంవత్సరం తర్వాత చేపట్టే మొదటి జనాభా గణన వరకు ఎటువంటి మార్పు ఉండదని స్పష్టంగా పేర్కొంది' అని పిటిషన్ తెలిపింది. జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతం, అసోం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్ రాష్ట్రాలలో కేంద్రం ద్వారా డీలిమిటేషన్ చేపట్టేందుకు డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ మార్చి 6, 2020 నాటి నోటిఫికేషన్‌ను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని కోరింది. మార్చి 3, 2021 నాటి నోటిఫికేషన్ ప్రకారం, విభజన ప్రక్రియ నుంచి అసోం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్‌ను విస్మరించడానికి కూడా సవాలు చేసింది. ఇది వర్గీకరణకు సమానమని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (చట్టం ముందు సమానత్వం) ను ఉల్లంఘిస్తోందని పిటిషన్ పేర్కొంది.

సుప్రీం తీర్పు ప్రాధాన్యతలేనిది

మెహబూబా ముఫ్తీ

బిజ్బెహరా (జమ్ముకశ్మీర్): ఆర్టికల్ 370, జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం రద్దుకు సంబంధించిన చట్టపరమైన సవాళ్లు పెండింగ్‌లో ఉన్నందున జమ్ముకశ్మీర్‌లో డీలిమిటేషన్ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలయిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడం ప్రాధాన్యత లేని విషయమని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ సోమవారం అన్నారు. 'మేము మొదటి నుంచి డీలిమిటేషన్ కమిషన్‌ను తిరస్కరించాము. తీర్పు ఎలా ఉంటుందనేది మాకు ముఖ్యం కాదు' అని శ్రీనగర్‌కు 41 కిలోమీటర్ల దూరంలో ఉన్న విలేకరులతో మెహబూబా అన్నారు. జమ్ముకశ్మీర్‌లోని శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలయిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. డీలిమిటేషన్ పిటిషన్‌పై ఇతర పిటిషన్లు ఇంకా పరిశీలనలో ఉన్నప్పుడే తీర్పును వెలువరించడంపై మాజీ ముఖ్యమంత్రి సుప్రీంకోర్టును ప్రశ్నించారు. 'పునర్వ్యవస్థీకరణ చట్టం (దీని కింద డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది) సవాలు పెండింగ్‌లో ఉంది. ఆర్టికల్ 370 రద్దుకు సవాలు సుప్రీంకోర్టు ముందు పెండింగ్‌లో ఉంది. అవన్నీ పెండింగ్‌లో ఉంటే, వారు (సుప్రీంకోర్టు) ఈ పిటిషన్‌పై ఎలా తీర్పు ఇస్తారు? అని ఆమె ప్రశ్నించారు. డీలిమిటేషన్ అనేది ఎన్నికలకు ముందు రిగ్గింగ్ చేసే వ్యూహాత్మక ప్రక్రియ అని మెహబూబా ఆరోపించారు. 'బీజేపీకి అనుకూలంగా మెజారిటీని మైనారిటీగా మార్చే పని చేశారు. డీలిమిటేషన్ కమిషన్ చర్చల్లో కూడా మేం పాల్గొనలేదు' అని తెలిపారు. న్యాయవ్యవస్థపై మీకు ఇంకా విశ్వాసం ఉందా అని మెహబూబా ప్రశ్నించగా, దేశంలో ఎవరికైనా కోర్టులే చివరి ఆశ, ఆశ్రయం అని అన్నారు. 'న్యాయవ్యవస్థకు సంబంధించినంతవరకు, పేదవాడు ఎక్కడికి వెళతాడు? బెయిల్ ఇవ్వడానికి దిగువ కోర్టులు భయపడుతున్నాయని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ కూడా అన్నారు. బెయిల్ ఇవ్వడానికి కోర్టు భయపడితే, వారు ఎలా (న్యాయమైన) తీర్పులు ఇస్తారు? అని ఆమె అన్నారు. ఒకప్పుడు కోర్టు తీర్పు అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని నిలదీసింది. నేడు, ప్రజలు కోర్టుల నుంచి బెయిల్ కూడా పొందలేరు' అని ఆమె తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో చర్చికి నిప్పు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురం జిల్లా చౌకీపురా గ్రామంలో కొందరు దుండగులు ఒక చర్చికి నిప్పుపెట్టి లోపలి గోడలపై మతపరమైనరాతలు రాశారు. గిరిజనులు ఎక్కువగా నివసించే ప్రాంతంలో ఈ చర్చి ఉంది. ఐదేళ్ల కిందట నిర్మించిన ఈ చర్చి వద్దకు ఆదివారం అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని కొందరు వ్యక్తులు వచ్చారు. కిటికీ తెరిచి లోనికి ప్రవేశించారు. లోపల ఉన్న కొన్ని వస్తువులకు నిప్పుపెట్టారు. మరి కొన్ని వస్తువులను ధ్వంసం చేశారు. చర్చి లోపలి గోడలపై 'రామ్' అని హిందీలో రాశారు. సోమవారం ఉదయం దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనేక సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వాలో మరో వివాదస్పద ఘటన సోమవారం జరిగింది. ఒక ముస్లిం వ్యక్తి ఇంట్లోకి కొందరు బలవంతంగా చొరబడి హనుమంతుడి విగ్రహాన్ని ఉంచారు. దీంతో రెండువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. అక్కడకు చేరుకున్న పోలీసులు లాఠీచార్జ్ చేసి జనాన్ని చెదరగొట్టారు. ఈ సందర్భంగా జరిగిన రాళ్ల దాడిలో నలుగురు పోలీసులు గాయపడ్డారు. ఈ ఘటనలపై అనేక సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకు ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ వివాదానికి ప్రధాన నిందితుడు హిందూ నాయకుడు రవి అవడ్ అని పోలీసులు తెలిపారు.

500 వాహనాలను కొనుగోలు చేయనున్న ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ: దేశరాజధానిలో త్వరలో జరగబోయే జీ20 కార్యక్రమాలను దృష్టి ఉంచుకుని ఢిల్లీ పోలీసులు 500 కొత్త సాంకేతికత, భద్రత ఉండే వాహనాలను కొనుగోలు చేయనున్నట్టు అధికారులు సోమవారం తెలిపారు. అధికారుల వివరాల ప్రకారం, ఢిల్లీ పోలీసులకు 200 మహీంద్ర బొలెరోలు, 7 సీట్ల సామర్థ్యం ఉన్న ఎస్‌యూవీలు, 200 మారుతీ ఎర్టిగాలు ఉన్నాయి. ఈ రెండు బ్రాండ్ల వాహనాలు మార్చిలోపు వస్తాయని తెలిపారు. '100 స్కార్పియో కార్లను కూడా కొంటున్నాం. రోజువారీ భద్రతను వినియోగించేందుకు ఇవి సరిపోతాయి. కానీ జీ-20 సమావేశాలను దృష్టిలో పెట్టుకుని 500 కొత్త వాహనాలను కొనుగోలు చేయనున్నాం' అని వివరించారు.

కేరళతో సమస్యేంటో అమిత్‌షా చెప్పాలి

కేరళ సీఎం విజయన్ డిమాండ్

కొట్టాయం: కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శలతో విరుచుకుపడ్డారు. కేరళతో అసలు సమస్యేంటో అమిత్ షా చెప్పాలని విజయన్ డిమాండ్ చేశారు. కేరళలో అన్ని వర్గాల ప్రజలు ఐకమత్యంగా జీవిస్తున్నారని, ఎవరితో ఎవరికీ సమస్యల్లేవని విజయన్ అన్నారు. రాష్ట్రంలో పాలన బాగుండటం, ప్రజలు సామరస్యంతో ఉండటమే బీజేపీకి పెద్ద సమస్యగా మారిందన్నారు. సీపీఎం కార్యకర్తలతో జరిగిన సమావేశంలో విజయన్ మాట్లాడారు. ఈ సందర్భంగా అమిత్ షాపై విమర్శలు చేశారు. అయితే దీనికో కారణం ఉంది. ఇటీవల దక్షిణ కర్ణాటకలో పర్యటించిన అమిత్‌షా కేరళ రాష్ట్రంపై విమర్శలు చేశారు. అక్కడ నిషిద్ధ పీఎఫ్ఐ (పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా) సభ్యులు భారీ స్థాయిలో పట్టుబడిన అంశాన్ని అమిత్ షా ప్రస్తావించారు. పరోక్షంగా తీవ్రవాదులకు కేరళ మద్దతు ఇచ్చిందని అభిప్రాయపడ్డారు. దీనిపై సీఎం విజయన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. షా వ్యాఖ్యలపై మండిపడ్డారు. "కేరళలో ఏ విషయం ప్రమాదకరంగా అనిపించిందో అమిత్ షా చెప్పాలి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే మైనారిటీలపై వేధింపులు ఎక్కువయ్యాయి. దాడులు జరుగుతున్నాయి. కానీ, కమ్యూనిస్టులు పాలిస్తున్న కేరళలో మాత్రం వాళ్లు ప్రశాంతంగా జీవిస్తున్నారు. కేరళలో పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలుసు. ఇక్కడ సమస్యేంటో అమిత్ షా చెప్పాలి. కర్ణాటకలో మైనారిటీలు దాడులకు గురవుతుంటే, కేరళలో మాత్రం క్షేమంగా ఉన్నారు. మత ఘర్షణలు సృష్టించాలన్న అమిత్ షా లక్ష్యం కేరళలో మాత్రమే నెరవేరడం లేదు. పొరుగునే ఉన్న కర్ణాటకలోని మంగళూరు, చిక్‌మగళూరులో సంఘ్ పరివార్ ఆధ్వర్యంలో మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయి. అక్కడ 150 ఏళ్ల చర్చిపై సంఘ్ పరివార్ కార్యకర్తలు 2021 క్రిస్మస్ సందర్భంగా దాడి చేశారు. కానీ, అలాంటి పరిస్థితి కేరళలో ఉందా?" అని విజయన్ వ్యాఖ్యానించారు. కేరళలో దేశంలోనే అత్యుత్తమ శాంతిభద్రతలు ఉన్నాయని, లౌకికవాదాన్ని పాటిస్తున్నట్లు వివిధ సూచీలు చెబుతున్నాయని పేర్కొన్నారు. అయితే సంఘ్ పరివార్... మతతత్వం, మత హింసతో అభివృద్ధి చెందుతోందన్నారు. నిజమైన సమస్యలు, వారి దుష్పరిపాలన నుంచి ప్రజల దృష్టిని మరల్చాలనుకుంటున్నారని విజయన్ తెలిపారు. 'ఈ దేశంలో బీజేపీ విధ్వంసక శక్తిగా మారింది. బీజేపీకి ఒక్క అవకాశం ఇస్తే అది దేశానికి తీరని లోటు' అని విజయన్ అన్నారు. సంఘ్ పరివార్‌పై పోరాడేందుకు వారి ప్రాబల్యం ఉన్న ప్రతి రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు ఒక్క తాటిపైకి వచ్చాయన్నారు. కాంగ్రెస్ పార్టీపై కూడా విజయన్ విమర్శలు గుప్పించారు. అది బీజేపీకి 'రిక్రూటింగ్ పార్టీ'గా మారిందని అన్నారు. 'ఏఐసీసీ సభ్యులు, కేంద్ర మాజీ మంత్రులు, పార్లమెంటేరియన్లు, రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర పీసీసీ చీఫ్‌లతో సహా సీనియర్ నేతలు అందరూ ఇప్పుడు బీజేపీకి పని చేస్తున్నారు. వారు వాస్తవాన్ని అంగీకరించాలి. బీజేపీని ఎదుర్కోవాలంటే బీజేపీ విధానాలను ఎదిరించేందుకు సిద్ధంగా ఉండాలి. దేశంలో లౌకికవాదాన్ని బీజేపీ ప్రమాదంలో పడేస్తోంది' అని ఆయన పేర్కొన్నారు. లౌకికవాదాన్ని కాపాడేందుకు మతతత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ గట్టిగా పోరాడాలని విజయన్ కోరారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వంపై కూడా విమర్శలు చేశారు. తాను బీజేపీలోకి వెళతాను అని చెప్పుకునే ఒక ముఖ్యనేత నాయకత్వం వహిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎంపీలు కేరళ అభివృద్ధి అంశాలను లేవనెత్తాల్సింది పోయి పార్లమెంట్‌లో రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చుతున్నారన్నారు.

690 విశ్వవిద్యాలయాలు, 34 వేల కళాశాలలకు గుర్తింపు లేదు

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కనీసం 695 విశ్వవిద్యాలయాలు, 34 వేల కళాశాలలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) గుర్తింపు లేకుండా పని చేస్తున్నాయని సోమవారం ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో ఒక లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుభాస్ సర్కార్ ఈ సమాచారాన్ని పంచుకున్నారు. యూజీసీ నుంచి అందిన సమాచారం ప్రకారం 1,113 విశ్వవిద్యాలయాలు, 43,796 కళాశాలలకుగాను 418 విశ్వవిద్యాలయాలు, 9,062 కళాశాలలకు నాక్ గుర్తింపునిచ్చిందని తెలిపారు. 'అన్ని విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలను గుర్తింపు వ్యవస్థ కిందకు తీసుకురావడానికి, నాక్ మూల్యాంకనం, గుర్తింపు కోసం రుసుమును గణనీయంగా తగ్గించింది. అనుబంధ, రాజ్యాంగ కళాశాలల స్వీయ-అధ్యయన నివేదిక కోసం మాన్యువల్‌లోని కొలమానాలు, ప్రశ్నలు కూడా గణనీయంగా తగ్గించడం జరిగింది' అని మంత్రి వివరించారు. నాక్ గుర్తింపు లేకుండా నడుస్తున్న కళాశాలల సంఖ్య 34,734 అని తెలిపారు. కొత్త జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) అన్ని ఉన్నత విద్యాసంస్థలు తమ సంస్థాగత అభివృద్ధి ప్రణాళికల ద్వారా రాబోయే 15 సంవత్సరాలలో అత్యున్నత స్థాయి గుర్తింపును సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)కు చెందిన అంతర్ విశ్వవిద్యాలయాల కేంద్రం అయిన నాక్ ద్వారా విశ్వవిద్యాలయాలు, కళాశాలల గుర్తింపు జరుగుతుంది.

హక్కులను బుల్డోజర్ కింద అణచివేయకండి: ప్రియాంక

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లో కొనసాగుతున్న ఆక్రమణల వ్యతిరేక డ్రైవ్‌పై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా సోమవారం ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. శాంతి, విశ్వాసం కోసం సామాన్య ప్రజల మాటలను వినడం అవసరం. బుల్డోజర్ కింద వారి హక్కులను అణిచివేయడం కాదని విమర్శించారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపి వంటి ప్రధాన రాజకీయ పార్టీలు ఈ డ్రైవ్‌కు వ్యతిరేకంగా తమ ఆందోళన చేపట్టాయి. తక్షణమే ఈ డ్రైవ్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశాయి. జమ్ముకశ్మీర్‌లోని ఆక్రమణలను 100 శాతం తొలగించాలని దేవాదాయ శాఖ కమిషనర్ సెక్రటరీ విజయ్ కుమార్ బిధూరి డిప్యూటీ కమిషనర్లను ఆదేశించడంతో అధికారులు ఇప్పటివరకు 10 లక్షల కెనాల్స్ (ఒక కెనాల్ 605 చదరపు గజాలు) భూమిని స్వాధీనం చేసుకున్నారు. లడఖ్‌లో తమ రాజ్యాంగ హక్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్న ప్రజలపై దౌర్జన్యాలు జరుగుతున్నాయని గాంధీ హిందీలో చేసిన ట్వీట్‌లో ఆరోపించారు. కశ్మీర్‌లో సామాన్యులు చెప్పే మాటలు పట్టించుకోకుండా వారి ఇళ్లను బుల్‌డోజర్‌లో ధ్వంసం చేస్తున్నారు" అని ప్రియాంక పేర్కొన్నారు. ఈ సందర్భంగా జమ్ము కశ్మీర్‌లో తొలగింపు డ్రైవ్‌పై వివిధ మీడియా నివేదికల స్క్రీన్‌షాట్‌లను కూడా ఆమె ట్విట్టర్‌లో ట్యాగ్ చేశారు.

వైద్యులపై దాడులు అరికట్టడానికి చట్టం

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ డిమాండ్

న్యూఢిల్లీ: ఆరోగ్య సంరక్షణ నిపుణులపై జరుగుతున్న హింసను అరికట్టడానికి సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ సోమవారం డిమాండ్ చేశారు. లోక్‌సభలో ఈ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించిన ఆయన... రోగుల బంధువుల నుంచి శారీరక వేధింపులకు గురవుతున్న వైద్యులకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టిందని, అలాంటి ఘటనలు జరగకుండా కఠిన చట్టం తీసుకురావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. మొత్తం వైద్యుల్లో 75 శాతం మంది ఏదో ఒక రకమైన శారీరక వేధింపులకు గురవుతున్నారని, అలాంటి సంఘటనలను ఎదుర్కోవడానికి ప్రస్తుతం ఉన్న చట్టాలు బలహీనంగా ఉన్నాయని అన్నారు. ఆరోగ్య నిపుణులపై హింసకు అరికట్టేందుకు ప్రభుత్వం 2019లో పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టిందని, అయితే తర్వాత దానిని ఉపసంహరించుకున్నారని థరూర్ తెలిపారు. బీజేపీ సభ్యుడు నిషికాంత్ దూబే జార్ఖండ్‌లో తన గొడ్డా నియోజకవర్గంలో జాతీయ పౌర నమోదుకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ సంతాల్ సమాజానికి చెందిన వారి జనాభా క్షీణించింది. తన నియోజకవర్గంలోని ఆరు జిల్లాల్లో బంగ్లాదేశ్ వలసదారుల సంఖ్య పెరుగుతోందని చెప్పారు. గిరిజన సంఘం సభ్యులు ఇతర మతాల్లోకి మారితే వారికి వర్తించే ప్రయోజనాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. రెండు నగరాల మధ్య ప్రయాణీకుల సంఖ్యను పెంచడానికి బెంగళూరు-కోజికోడ్ మధ్య పాలక్కాడ్-షోరనూర్ మీదుగా వందే భారత్ రైలును ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ సభ్యుడు వి.కె.శ్రీకందన్ డిమాండ్ చేశారు. బీజేపీ సభ్యుడు తీర్థ్ సింగ్ రావత్ మాట్లాడుతూ ఇటీవల భూమి క్షీణతకు సంబంధించిన ఘటనలను చవిచూసిన జోషిమఠ్ కోసం మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని డిమాండ్ చేశారు. బద్రీనాథ్, స్కీయింగ్ గ్రామమైన ఔలి, ఇండో-టిబెటన్ సరిహద్దుకు ప్రవేశ ద్వారం అయిన జోషిమఠ్‌లోని చాలా ప్రాంతాల్లో పరిస్థితి సాధారణంగా ఉందని ఆయన అన్నారు. ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి రావత్ మాట్లాడుతూ జోషిమఠ్‌లోని 25-30 శాతం ప్రాంతం భూమి క్షీణించడం వల్ల ప్రభావితమైందని, హిమాలయ పట్టణంలోని ఇతర ప్రాంతాలలో జనజీవనం సాధారణంగా ఉందని అన్నారు. ఇదిలాఉండగా, గత నెలలో చత్తీస్‌గఢ్‌లో నలుగురు బీజేపీ ఆఫీసు బేరర్ల హత్యలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని బీజేపీ సభ్యుడు అరుణ్ సావో డిమాండ్ చేశారు.

లోక్‌సభను మున్సిపల్ కార్పొరేషన్ చేయొద్దు

బీజేపీ, టీఎంసీ ఎంపీల వాగ్వాదంపై స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సమస్యపై బీజేపీ, టీఎంసీ ఎంపీలు వాగ్వాదానికి దిగడంతో పార్లమెంటు దిగువ సభను 'మునిసిపల్ కార్పొరేషన్' గా మార్చవద్దని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సోమవారం సభ్యులను కోరారు. అధికార బీజేపీకి చెందిన ఎంపీ సౌమిత్రా ఖాన్ ప్రశ్నోత్తరాల సమయంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం చెల్లింపు అంశాన్ని లేవనెత్తడంతో పాటు ఈ విషయాన్ని కేంద్రం పరిష్కరించగలదా అని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను ప్రశ్నించడంతో మాటల యుద్ధ జరిగింది. 'పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఉద్యోగులు నిరాహారదీక్షకు కూర్చున్నారు. వారికి కరువు భత్యం లభించడం లేదు. కేంద్ర ప్రభుత్వం నేరుగా (సమస్యను పరిష్కరించగల) ఏదైనా నిబంధన ఉందా?' అని ఖాన్ ప్రశ్నించారు. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సభ్యుడు కళ్యాణ్ బెనర్జీ వెంటనే ఖాన్ ఈ అంశాన్ని లేవనెత్తడాన్ని వ్యతిరేకించారు. లోక్‌సభలో దాని ఔచిత్యాన్ని ప్రశ్నించారు. కేంద్రం రూపొందించిన అసంఘటిత కార్మికుల జాతీయ డేటాబేస్ అయిన ఇ-శ్రామ్ పోర్టల్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎంత మంది కార్మికులు నమోదు చేసుకున్నారో కూడా బీజేపీ ఎంపీ మంత్రిని కోరారు. ఖాన్ ప్రశ్నకు యాదవ్ సమాధానమిస్తూ, పశ్చిమ బెంగాల్ నుంచి 2.57 కోట్ల మంది కార్మికులు పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని చెప్పారు. అయితే, తాను లేవనెత్తిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై మంత్రి ఏమీ మాట్లాడలేదు. 'మిగిలిన అంశాన్ని పరిశీలించిన తర్వాత నేను సమాధా నం ఇస్తాను' అని యాదవ్ చెప్పారు. ఖాన్ ప్రశ్నకు బెనర్జీ అభ్యంతరం తెలుపుతూ 'మేము ఇక్కడ కూర్చున్నాం. కానీ వారు ఇక్కడ ఏమి మాట్లాడగలరని దీని అర్థం కాదు. ఔచిత్యం అవసరం. అతను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కరువు భత్యం చెల్లింపు, దీనిగురించి మాట్లాడుతు న్నారు. ప్రశ్నతో ఎటువంటి సంబంధం లేదు' అని తెలిపారు. బీజేపీ సభ్యుడు బెనర్జీని ఎదురుదాడి చేసేందుకు ప్రయత్నించగా, బీజేపీ, టీఎంసీ ఎంపీల మధ్య మాటల యుద్ధం జరిగింది. లోక్‌సభ స్పీకర్ బిర్లా జోక్యం చేసుకోవలసి వచ్చింది. 'మీలో మీరు చర్చించుకోకండి... మున్సిపల్ కార్పొరేషన్‌గా మార్చకండి' అని బిర్లా పేర్కొంటూ, ఒకరితో ఒకరు వాగ్వాదం ఆపాలని కోరారు.

వయనాడ్ నియోజకవర్గాన్ని సందర్శించిన రాహుల్

వయనాడ్(కేరళ): ఇటీవల కోజికోడ్ వైద్య కళాశాల వద్ద చనిపోయిన స్థితిలో గుర్తించి గిరిజనుడికి ఇంటిని సోమవారం కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సందర్శించారు. ఫిబ్రవరి 11న, విశ్వనాథం(46) తన భార్య ప్రసవం కోసం చేర్పించిన కోజికోడ్ వైద్య కళాశాల వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం రాత్రి కోజికోడ్ విమానాశ్రయం చేరుకున్న రాహుల్, పార్టీ నాయకులతో కలిసి సోమవారం వయనాడ్ నియోజకవర్గంలోని విశ్వనాథం ఇంటికి వెళ్లారు. ఆ కుటుంబంతో కొంతసేపు గడిపి, వారం బాధలు, ఫిర్యాదులు తెలుసుకుని, ఆ కుటుంబాన్ని ఓదార్చారు. ఆస్పత్రి నుంచి గిరిజనుడు అదృశ్యమయ్యాడన్న బంధువుల ఫిర్యాదుతో తాము కేసు నమోదు చేసినట్టు కోచికోడ్ మెడికల్ కాలేజీ పోలీసులు తెలిపారు. అనంతరం ఫిబ్రవరి 11న విశ్వనాథం ఉరి వేసికుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే కుటుంబ సభ్యులు సమాచారం ప్రకారం ఫిబ్రవరి 9న కొంతమంది విశ్వనాథాన్ని వేధించినట్టు తెలిసిందని, అందుకే ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. భారత్ జోడో యాత్ర ముగించుకున్న అనంతరం రాహుల్ గాంధీ చేపట్టిన మొట్టమొదటి సందర్శన ఇదే కావడం గమనార్హం.

ఆ ప్రలోభాలకు లొంగివుంటే...: అనిల్ దేశ్‌ముఖ్

ముంబై: మహారాష్ట్ర మాజీ హోం మంత్రి, ఎన్సీపీ నాయకుడు అనిల్ దేశ్‌ముఖ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను జైలులో ఉన్నప్పుడు ఒక ఆఫర్ వచ్చిందనీ, దానికి తాను అంగీకరించి ఉంటే మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ప్రభుత్వం రెండేళ్ల కిందటే పడిపోయేదని చెప్పారు. అయితే న్యాయం మీద నమ్మకం ఉండటంతో ఆ ప్రతిపాదనను తిరస్కరించినట్లు చెప్పారు. వార్ధాలోని సేవాగ్రామ్‌లో జరిగిన అటవీ హక్కుల రాష్ట్ర స్థాయి సదస్సులో అనిల్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ద్వారా చర్యలు తీసుకుంటామని బెదిరించడం వల్లనే శివసేనకు చెందిన 40 మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీని వీడి బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. తప్పుడు ఆరోపణలతో తనను 14 నెలలు జైల్లో ఉంచారని, అయినప్పటికీ బెదిరింపులు, ప్రలోభాలకు తాను లొంగలేదని చెప్పారు. మహారాష్ట్ర హోంమంత్రిగా ఉన్న అనిల్ దేశ్‌ముఖ్‌ను మనీలాండరింగ్, అవినీతి కేసుల ఆరోపణలపై 2021 నవంబర్‌లో ఈడీ అరెస్ట్ చేసింది. సుమారు 14 నెలలు జైలులో ఉన్న ఆయన గత ఏడాది డిసెంబర్ 28న బెయిల్‌పై విడుదలయ్యారు. తాను జైలులో ఉన్నప్పుడు తనకు వచ్చిన ఆఫర్‌ను అంగీకరించి ఉంటే రెండున్నర ఏళ్ల కిందటే ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం పడిపోయేదని తెలిపారు.

ఐఐటీ బాంబేలో దళిత విద్యార్థి ఆత్మహత్య

ముంబై: దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని ఐఐటీ బాంబేలో విషాదం చోటు చేసుకుంది. బీటెక్ ఫస్టియర్ చదువుతున్న 18 ఏళ్ల విద్యార్థి క్యాంపస్ ఆవరణలో ఆదివారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనాస్థలిలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని పోలీసులు తెలిపారు. మృతుడిని అహ్మదాబాద్‌కు చెందిన దర్శన్ సోలంకిగా పోలీసులు గుర్తించారు. దర్శన్ శనివారమే తన మొదటి సెమిస్టర్ ఎగ్జామ్స్ పూర్తి చేశాడు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇక క్యాంపస్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. అంబేద్కర్ పెరియార్ పూలే స్టడీ సర్కిల్ దర్శన్ మృతికి సంతాపం తెలిపింది. మూడు నెలల క్రితమే దర్శన్ ఐఐటీ బాంబేలో చేరారు. దర్శన్‌ది ఆత్మహత్య కాదు... హత్య అని ట్వీట్‌లో పేర్కొన్నది. దళిత, బహుజన, ఆదివాసీ విద్యార్థులకు క్యాంపస్‌లో భద్రత లేకుండా పోయిందనీ, కులం పేరుతో దూషిస్తున్నారని, ఈ విషయంలో కొంత మంది లెక్చరర్లు, ఇతర సిబ్బంది కూడా వివక్షను ఎదుర్కొంటున్నారని తెలిపింది.

కర్ణాటకలో 16 నుంచి గడపగడపకూ కాంగ్రెస్

బెంగళూరు: అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ప్రజలను ఆకట్టుకునేందుకు కర్ణాటక కాంగ్రెస్ సమాయత్తమవుతోంది. ఈ నెల 16 నుంచి ఇంటింటి ప్రచారాన్ని చేపట్టాలని నిర్ణయించింది. తాము అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తామనే వివరాలతో కూడిన హామీ కార్డులను ఇంటింటి ప్రచారంలో ఓటర్లకు పంపిణీ చేయనుంది. పార్టీ నేతలు డీకే శివకుమార్, సిద్ధరామయ్య సంతకాలతో కూడిన హామీ పత్రాలను పార్టీ నాయకులు ప్రజలకు అందచేస్తారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్‌తో పాటు, మహిళలకు నెలకు రూ. 2000 చొప్పున నగదు అందిస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చింది. బొమ్మై ప్రభుత్వంపై కాంగ్రెస్ విడుదల చేసిన చార్జిషీట్‌నూ పార్టీ నేతలు ప్రజలకు అందిస్తారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటి తలుపు తట్టేలా నెలరోజుల పాటు ఈ ప్రచారం చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు నిర్ణయించారు. ఉద్యోగ కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, టూరిజం అభివృద్ధి, సమాజంలో శాంతి సామరస్యాలను నెలకొల్పడం వంటి అంశాలతో కాంగ్రెస్ ఇటీవల పది పాయింట్ల మేనిఫెస్టోను విడుదల చేయగా ఈ మేనిఫెస్టోను ఇంటింటికీ చేర్చే దిశగా ఈ ప్రచారాన్ని పార్టీ ఉపయోగించుకోనుంది. కర్ణాటక అసెంబ్లీ గడువు ఈ ఏడాది మే 24తో ముగియనుంది.

మహిళా గ్రూపు సభ్యులను అడ్డుకున్న పోలీసులు

ముంబై: మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తమ డిమాండ్‌ల వైపు దృష్టి సారించేలా 'హనుమాన్ చాలీసా' చదువుకుంటూ ఆయన కార్యాలయానికి వెళుతున్న మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) సభ్యులను నాగ్‌పూర్ పోలీసులు సోమవారం అడ్డుకున్నారని ఒక అధికారి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిన గౌరవ వేతనాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పొరుగున ఉన్న వార్ధాకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఫడ్నవీస్ స్వస్థలమైన నాగ్‌పూర్ నగరంలో వారం రోజులుగా నిరసన చేపట్టారు. ఆదివారం వారు నిరసన పిలుపునిచ్చిన తర్వాత ఫడ్నవీస్ కార్యాలయం వద్ద నగర పోలీసులు భద్రతను పెంచారు. నిరసనకారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న నిహాల్ పాండే మాట్లాడుతూ, తమ డిమాండ్‌ను హైలైట్ చేయడానికి ఫడ్నవీస్ నివాసం సమీపంలోని సంవిధాన్ స్క్వేర్ నుంచి త్రికోణి పార్క్ వరకు ర్యాలీని చేపట్టాలని ప్రణాళిక రచించినట్టు చెప్పారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయం వైపు కవాతు ప్రారంభించిన ప్పుడు నిరసనకారులను అడ్డుకున్నట్టు సీతాబుల్డి పోలీస్ స్టేషన్ అధికారి తెలిపారు. 'గౌరవ వేతనం లేకుండా ఈ మహిళలు జీవించడం కష్టంగా మారింది. వారం రోజులుగా నిరసనలు తెలుపుతున్నా ఫడ్నవీస్ వారిని కలవలేదు' అని పాండే పేర్కొన్నారు.

పుస్తకాలు విజ్ఞాన నిధి

- 'ఆత్మచిత్రం' ఆవిష్కరణ సభలో నల్లూరి
- ఉత్సాహంగా పుస్తక ప్రియుల పాదయాత్ర

విశాలాంధ్ర-విజయవాడ: పుస్తకం విజ్ఞాన నిధి... ఆ నిధిని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) అన్నారు. విజయవాడ ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న 33వ విజయవాడ పుస్తకమహోత్సవంలో సోమవారం విశాలాంధ్ర పబ్లిషర్స్, ఎమెస్కో పబ్లిషర్స్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కిలాడ సత్యనారాయణ రాసిన అనువాద గ్రంథం 'ఆత్మచిత్రం' ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమెస్కో అధినేత డి.విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అన్న మాట్లాడుతూ పుస్తక పఠనాన్ని ప్రోత్సహించటానికి ఇలాంటి ప్రదర్శనలు ఉపయోగపడ తాయన్నారు. విశాలాంధ్ర, ప్రజాశక్తి, ఎమెస్కో సంస్థలు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తట్టుకుని బాధ్యతగా పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నాయని అభినందించారు. అనంతరం విశాలాంధ్ర పబ్లిషర్స్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించి కొన్ని పుస్తకాలను కొనుగోలు చేశారు. ముందుగా ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ 'ఆత్మచిత్రం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... విద్యార్థులు సిలబస్‌లో ఉన్న పాఠాలను మాత్రమే చదువుతున్నారని, అభిరుచికి తగిన పుస్తకాలు చదివేవారి సంఖ్య తగ్గిపోతోందన్నారు. పుస్తక రూపంలో ఉన్నా, డిజిటల్ రూపంలో ఉన్నా చదవటం అనే అలవాటు నిరంతరం కొనసాగించాలని సూచించారు. హైదరాబాద్ బుక్ ట్రస్ట్ అధినేత గీతారామస్వామి మాట్లాడుతూ... పుస్తక మహోత్సవానికి ఉచితంగా ప్రవేశం కల్పిస్తూ చాలా శుభ్రంగా, పద్ధతిగా స్టాల్స్‌ను ఏర్పాటు చేసి పాఠకులను ఆకర్షించేలా చేస్తున్న నిర్వాహకులను అభినందిచారు. మానవీయ కోర్సులు మానేసి ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులకు పిల్లలను ఆకర్షితులను చేయటం వల్ల తెలుగు చదివేవారు తగ్గిపోతున్నారని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగు సాహిత్య ఉత్సవాల్సి నిర్వహించి కవులు, రచయితలను ప్రోత్సహించాలని సూచించారు. కవి వాడ్రేవు చినవీరభద్రుడు మాట్లాడుతూ... రచయిత ఐపీఎస్ అధికారి అయినా కేధార్‌నాథ్ రాసిన హిందీ కవితలను

అనువదించారని చెప్పారు. కేవలం అక్షరాలను భాషలోకి తర్జుమా చేయటం కాకుండా కవి నివసించిన గ్రామంలో పర్యటించి అక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకుని అక్షర బద్ధం చేశారని వివరించారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ... ప్రతి కవి, రచయిత కాలజ్ఞానులే అన్నారు. రాబోయే రోజులల్లో సమాజం ఎలా ఉంటుందో ఊహించి రాయగల శక్తి కవులకు ఉంటుందన్నారు. చదివే అలవాటును కొనసాగించటం నేటి తరం బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో అధికార భాషా సంఘం సభ్యుడు గాజుల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవ కమిటీ అధ్యక్షుడు టి.మనోహరనాయుడు అతిథులకు స్వాగతం పలికారు. సభలో ఆవిష్కరించిన పుస్తకాలను అతిథులకు బహూకరించారు. కమిటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య వందన సమర్పణ చేశారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో ఎప్పటిలాగే నాలుగవ రోజు పుస్తక ప్రియుల పాదయాత్ర ఉత్సాహభరితంగా సాగింది. మొగల్రాజపురంలోని సిద్ధార్థ అకాడమి నుంచి నేషనల్ హైవే సర్వీసు రోడ్డు వెంబడి పుస్తక మహోత్సవ వేదిక వరకు దాదాపు 4 కిలోమీటర్లు ఈ పాదయాత్ర జరిగింది. పుస్తక కమిటీ సభ్యులు, కవులు, రచయితలు, సాహితీవేత్తలు, సామాజిక విశ్లేషకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చదవాలి... రాయాలి... భాషను రక్షిద్దాం అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పుస్తక మహోత్సవ కమిటీ అధ్యక్షుడు టి.మనోహరనాయుడు, కార్యదర్శి కె.లక్ష్మయ్య, సమన్వకర్త డి.విజయకుమార్, పూర్వ అధ్యక్షులు బాబ్జి, కవి వాడ్రేవు చినవీరభద్రుడు, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫాసిస్టుల నుంచి దేశాన్ని రక్షించాలి: గని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజ్యాంగ వ్యతిరేక ఫాసిస్టుల నుంచి దేశాన్ని పరిరక్షించు కోవాల్సిన అవసరం కవులు, కళాకారులు, రచయితలపై ఉందని ఇప్టా జాతీయ కార్యదర్శి గని స్పష్టం చేశారు. సోమవారం విజయవాడ దాసరిభవన్‌లో ఇప్టా 15వ జాతీయ మహాసభల కరపత్రాలను ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి అధ్వర్యంలో విడుదల చేశారు. ఇప్టా జాతీయ కార్యదర్శి గని మాట్లాడుతూ ఇప్టా జాతీయ మహాసభలు మార్చి 15 నుంచి 20 వరకు జార్ఖండ్‌లోని డెల్టాన్ గంజ్ పట్టణంలో జరుగుతున్నాయన్నారు. దేశంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా నూతన కళారూపాలను ఇప్టా జాతీయ మహాసభలు సిద్ధం చేస్తాయని తెలిపారు. ప్రాథమిక విద్య నుంచి పిల్లల్లో మత ఉన్మాదాన్ని వాళ్ళ బుర్రల్లో చొప్పించడానికి మతోన్మాద శక్తులు విపరీతంగా ప్రయత్నం చేస్తున్నాయని, చదువుతో పాటు అందులో ఉన్న ప్రస్తుత పాఠ్యాంశాలను తొలగించి ఫాసిస్టులకు అనుకూలంగా ఉన్న గాడ్సే, గోవాల్కర్ తదితర మతోన్మాదుల జీవిత చరిత్రలను పాఠ్యాంశాలలో చేర్చడానికి ప్రయత్నిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. కళల్లో కూడా వాళ్ల ఫాసిజాన్ని చొప్పించి దేశవ్యాప్తంగా 2024 వరకు ఈ దేశాన్ని రక్తపాతంలో ముంచాలని

ప్రయత్నిస్తున్న క్రమంలోనే కశ్మీర్ ఫైల్స్, తెలంగాణ ఫైల్స్, కేరళ ఫైల్స్, అంటూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభు త్వాలను నిరంకుశంగా కూల్చడానికి జరుగుతున్న ప్రయత్నం అందరికీ విదిత మేనన్నారు. దీనిపై జాతీయ మహాసభల్లో ఒక కార్యరూపాన్ని తీసుకు రావడానికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పోరాడుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్ర నాయక్, చిన్నం పెంచలయ్య మాట్లా డుతూ ఈ మహాసభలకు ఆంధ్రప్రదేశ్ నుంచి కవులు కళాకారులు పెద్ద సంఖ్యలో వెళు న్నామన్నారు. కవులు, కళాకారులు, రచయితలపై రోజువారిగా కొనసాగుతున్న దాడులు, హత్యలు, అవమానకర సంఘటనను వారు తీవ్రంగా ఖండించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అనేక కొత్త కళారూపాలను ఈ మహాసభ రూపొందిం చనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని సాహిత్య కళాభిమానులందరూ ఈ మహాసభలు జయ ప్రదానికి సంపూర్ణంగా ఆర్థికంగా హార్దికంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఆర్.రామకృష్ణ, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే నజీర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆరేటి రామారావు, ప్రజానాట్యమండలి ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి లంక దుర్గారావు, విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి సూరిబాబు పాల్గొన్నారు.

జూన్ డెడ్‌లైన్!

- ఇకనైనా పనితీరు మెరుగుపర్చుకోండి
- ఆ 20 మందికి ఇదే చివరి అవకాశం
- గడప గడపకూ నిర్లక్ష్యంపై సీఎం జగన్ సీరియస్
- మార్చి 18 నుంచి 26 వరకు 'జగనే మా భవిష్యత్తు'
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులంతా ప్రచారంలో పాల్గొనాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అధికార పార్టీ శాసనసభ్యులు అధిష్టానం సూచనలు నిర్లక్ష్యం చేయడంపై సీఎం జగన్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో వైసీపీ విజయపతాకం ఎగురవేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా శాసనసభ్యులు, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లను నేరుగా ప్రజల వద్దకు పంపుతున్నారు. గత మూడున్నర సంవత్సరాల కాలంలో నవరత్నాలు సంక్షేమ పథకాల ద్వారా ఇంటింటికి ప్రభుత్వం ఎంత లబి చేకూర్చిందో వివరాలు తెలియజేస్తూ ప్రజల ఆశీర్వచనం తీసుకోవాలని సీఎం సూచిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని, కావాలని అలక్ష్యం చేస్తే వచ్చే ఎన్నికలకు వారికి టికెట్ ఇవ్వబోనని కూడా చెప్పారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా పార్టీ అధ్యక్షులతో సోమవారం సీఎం జగన్ మరోసారి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తున్న 20 మంది ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేదని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను, లబ్ధిదారులకు అందజేసిన పథకాలను వారికి వివరించడానికి మీకు వచ్చిన ఇబ్బందేంటి ? ఎందుకు తిరగడం లేదు. మనం ఎంత చేసినా ప్రతిపక్షాలు ఒకపక్క దుష్ప్రచారం చేస్తున్నప్పుడు, అది తప్పని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉంది. లేకపోతే వారు చెప్పేదే నమ్మే అవకాశం ఉందని సీఎం వారికి క్లాసు తీసుకున్నారు. ఆ 20 మందికి జూన్ వరకు అవకాశం ఇస్తున్నాం. పనితీరు మెరుగుపర్చుకోకపోతే పార్టీ కోసం కఠిన నిర్ణయం తీసుకోవల్సి వస్తుందని సీఎం హెచ్చరించినట్లు తెలిసింది. సీఎం ఆగ్రహానికి గురైన వారిలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌తో పాటు శాసనసభ్యులు కొడాలి నాని, సామినేని ఉదయభాను, వసంత వెంకట కృష్ణప్రసాద్ తదితరులున్నట్లు తెలిసింది.

మార్చి 18-26 మధ్య 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో మరింత విస్తృతం ప్రచారం నిర్వహించేందుకు మార్చి 18 నుంచి 26 వరకు 'జగనన్నే మా భవిష్యత్తు' పేరుతో ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. ఇదే విషయాన్ని ఈ సమావేశంలో ఎమ్మెల్యేలకు వివరించారు. ఈ కార్యక్రమంలో 5.65 లక్షల మంది సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొంటారని, మొత్తం 1.65 కోట్ల గృహాల సందర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం అత్యంత కీలకమని, నిర్దేశించుకున్న విధంగా ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. ఇప్పటికే 93 శాతం గృహసారథుల నియామకం పూర్తయింది. దాదాపు 5 లక్షల మంది గృహసారథులను నియమించుకున్నాం. ఫిబ్రవరి 16 లోగా అక్కడక్కడా మిగిలిపోయిన నియామకాలను పూర్తిచేస్తాం. పార్టీ కార్యక్రమాలు నిరంతర రాయంగా జరగాలంటే గృహసారథులనే వాళ్లు చాలా ముఖ్యమైనవారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల మొదటి బ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమాలు 387 మండలాల్లో ముగిశాయి. రెండో బ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమాలు మిగిలిన మండలాల్లో రేపటి నుంచి ప్రారంభమై, ఫిబ్రవరి19 వరకూ నడుస్తాయని సీఎం వివరించారు. మండలాల వారీగా జరిగే ఈ శిక్షణ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు తప్పనిసరిగా పాల్గొనడంతో పాటు ఇవి ముగిసిన తర్వాత క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల రూపేణా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సుమారు 5.65 లక్షల మందితో క్షేత్రస్థాయిలో పార్టీ సైన్యం ఉంది. వీరంతా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొంటారు. గత ప్రభుత్వం కన్నా ఈ ప్రభుత్వం అందించిన మెరుగైన పాలన, అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తారని సీఎం వెల్లడించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు కలిసికట్టుగా పనిచేయండి

గ్రాడ్యుయేట్లు, టీచర్లకు సంబంధించిన 5 ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల పరిశీలకులంతా కలిసికట్టుగా పని చేసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సీఎం పిలుపునిచ్చారు. కొన్ని మీడియా సంస్థలు ఉన్నది లేనట్టుగా, లేనివి ఉన్నట్టుగా చూపిస్తున్నాయి. ప్రజలకు నిరంతరం ఏదో ఒక భ్రమ కల్పించే పనులు చేస్తున్నాయి. వీటిని తిప్పికొడుతూ మనం ముందుకు సాగాలన్నారు. మరో 14 నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి. గడప గడపకూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఇంటికి వెళ్లడంతో పాటు ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరినీ పలకరించి వారితో కొంత సమయం గడపాలని సీఎం కోరారు. అప్పుడే మీతో పాటు పార్టీ తిరుగులేని విజయం సాధిస్తుందని సీఎం వారికి దిశానిర్దేశం చేశారు.

గంజాయి మత్తులో అమానుషం

అంధురాలి దారుణ హత్య: నిందితుడు పరార్

విశాలాంధ్ర-తాడేపల్లి: ముఖ్యమంత్రి నివాసానికి కూత వేటు దూరంలో అమానుషం జరిగింది. కంటి చూపు లేని ఎస్తేరు రాణి అనే 17 ఏళ్ల యువతిని రాజు అనే వ్యక్తి గంజాయి మత్తులో అతి కిరాతకంగా నరికి చంపాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బాధితురాలి తల్లి మనోహరం మాట్లాడుతూ తన కుమార్తెను అన్యాయంగా చంపేశాడంటూ కన్నీటి పర్యంతమైంది. కళ్లు కనిపించవనే కనికరం కూడా చూపలేదని వాపోయింది. గంజాయి ముఠా ఆగడాలు పెరిపోతున్నాయని, రాజు గంజాయి సేవించే వచ్చాడని, రాణి పట్ల తాను అసభ్యంగా ప్రవర్తించడం లేదని చెప్పి వెళ్లిపోయాడని పేర్కొంది. మళ్లీ అరగంటలో వెనక్కి వచ్చి గొడ్డలితో నరికి చంపాడని తెలిపింది. తన కుమార్తె అబద్దాలు చెప్పదని...రాజు అసభ్యంగా ప్రవర్తించిన మాట వాస్తవమేనని తెలిపింది. తన కుమార్తెను అన్యాయంగా నరికేశాడని... గతంలో కూడా కొందరిపై కత్తితో దాడి చేశాడని ఆమె పేర్కొంది. గంజాయి ముఠా ఆగడాలతో స్థానికులు భయపడుతున్నారని, ఎవరైనా ప్రశ్నిస్తే ఇళ్ల మీదకు వెళ్లి అల్లరి చేస్తున్నారని, తనకు న్యాయం చేయాలని.. నిందితుడిని కఠినంగా శిక్షించాలని మనోహరం డిమాండ్ చేసింది.

అసలేం జరిగిందంటే...

కంటి చూపులేని రాణి ఇంట్లోనే ఉంటుండగా తల్లి కూలిపనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉంటున్న రాజు అనే యువకుడు, రాణిపై కన్నేశాడు. అప్పుడప్పుడూ రాణి ఇంటికి వచ్చి మాట్లాడుతుండటంతో స్థానికులు ఎవరూ పట్టించుకోలేదు. అయితే ఆమె ఇంట్లో ఒంటరిగా ఉండటం, పైగా అంధురాలు కావడంతో ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. రాజు వేధింపులు క్రమక్రమంగా పెరగడంతో ఈ విషయాన్ని రాణి తన తల్లికి, పెద్దమ్మకు చెప్పింది. దీంతో రాజును రాణి తల్లి మనోహరం నిలదీయడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో రాజు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయాడు. అప్పటికే గంజాయి మత్తులో ఉన్న అతడు అక్కడే ఉన్న గొడ్డలితో రాణిపై దాడి చేసి నరికాడు. దీంతో యువతి తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయింది. ఘటన జరిగిన వెంటనే రాజు అక్కడి నుంచి పరారయ్యాడు. కళ్లు కనిపించని తమ బిడ్డని చంపిన రాజుని కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

తప్పు చేయకు నెట్‌ఫ్లిక్స్... నాతో మజాక్‌లొద్దు: వెంకటేశ్





హైదరాబాద్: వెంకటేశ్, రానా కలిసి నటిస్తున్న వెబ్ సిరీస్ రానా నాయుడు. అమెరికన్ క్రైమ్ డ్రామా సిరీస్ 'రే డొనవన్'కు రీమేక్‌గా తెరకెక్కు తోంది. సుపర్ణ్ వర్మ, కరణ్ అన్షుమాన్ డైరెక్ట్ చేస్తున్న సిరీస్ త్వరలో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ క్రమంలో వెంకటేశ్ నెట్‌ఫ్లిక్స్‌పై కాస్త ఫైర్ అయ్యారు. గన్ పట్టుకుని బెదిరిస్తున్న ఓ వీడియోను ఆయన ట్విట్టర్‌లో షేర్ చేశారు. 'చాలా పెద్ద తప్పు చేస్తున్నావు నెట్‌ఫ్లిక్స్.. రానా నాయుడులో హీరో ఎవరు? నేను. అందరికంటే స్టార్ ఎవరు? నేను. అందంగా కనిపించేది నేనే, ఫ్యాన్స్ కూడా నా వాళ్లే! కాబట్టి షోకి రానా నాయుడు కాదు నాగా నాయుడు అని ఉండాలి. నాతో మజాక్‌లొద్దు' అని వార్నింగ్ ఇచ్చాడు. ఈ వీడియోను వెంకటేశ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేయగా సురేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్ రీట్వీట్ చేయగా అది వైరల్‌గా మారింది.

ఎన్‌టీఆర్-30... హీరోయిన్ ఎంపికపై అయోమయం

హైదరాబాద్: జూనియర్ ఎన్టీఆర్ ఇప్పుడు వార్తల్లో ఉన్నాడు. ఆ మధ్య తన అన్న కళ్యాణ్ రామ్ సినిమా ఫంక్షన్‌కి వచ్చి, కొరటాల శివతో తాను చెయ్యబోయే సినిమా ఎప్పుడు మొదలవుతుంది, ఎప్పుడు విడుదల అవుతుంది అనే విషయం చూచాయగా చెప్పాడు. ఇప్పుడు మళ్ళీ అదే వార్త సాంఘిక మాధ్యమాల్లో మరోసారి వైరల్ అవుతోంది. సినిమా ఈనెల 23వ తేదీన అధికారికంగా లాంచ్ అవుతుందని, మార్చి నెల నుంచి షూటింగ్ మొదలవుతుందని వార్తలు వస్తున్నాయి. అయితే ఇక్కడ ఇంకో విషయం కూడా ఉంది. ఎన్టీఆర్ పక్కన కథానాయిక ఎవరు అనే విషయం. ఎందుకంటే సాంఘిక మాధ్యమాల్లో జాహ్నవి కపూర్ అని అంటున్నారు. మొదటి నుండీ కూడా ఆమె పేరే వినపడుతోంది. ఆమె కూడా ఎన్టీఆర్‌ని చాలా సందర్భాల్లో చాలా పొగిడింది కూడాను. అందుకని ఆమెనే తీసుకోవచ్చు అని కూడా అన్నారు. అయితే ఇది పాన్ ఇండియా సినిమాగా చేయాలన్న ఉద్దేశంతో కూడా ఆమెని తీసుకోవచ్చు అని కూడా అన్నారు. ఇప్పుడు ఇంకో నటి మృణాల్ ఠాకూర్ పేరు కూడా వినపడుతోంది. ఈమె కూడా హిందీ సినిమాలు చాలా చేసి, మంచి పేరు సంపాదించుకుంది. దానికి తోడు ఆమధ్య విడుదల అయిన 'సీతారామం' సినిమాలో మృణాల్ చాలా చక్కగా నటించి అందరి మెప్పు పొందింది. అందుకనే ఆమెని కథానాయికగా తీసుకోవచ్చు అని ఇంకో వార్త కూడా వస్తోంది. లేక ఇద్దరు కథానాయికలు కూడా ఇందులో ఉండే అవకాశం వుంది అని కూడా అంటున్నారు. ఇంతకీ ఎవరు ఎన్టీఆర్ పక్కన నటిస్తారు అనే విషయం ఈ సినిమా అధికారికంగా లాంచ్ అయినపుడు ప్రకటించే అవకాశం వుంది.

నయనతార ఫ్యాన్స్ ఆగ్రహం... వెనక్కి తగ్గిన నటి మాళవిక

చెన్నై: 'మాస్టర్' బ్యూటీ మాళవికా మోహనన్‌పై లేడీ సూపర్‌స్టార్ నయనతార ఫ్యాన్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆమెను విమర్శిస్తూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. అభిమానుల తీరుతో నిరాశకు గురైన మాళవిక చేసేది లేక.. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. అసలు ఇంతకీ ఏం జరిగిం దంటే..? తన కొత్త చిత్రం 'క్రిస్టి' ప్రమోషన్స్‌లో భాగంగా మాళవికా మోహనన్ ఓ మలయాళీ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. తనకు 'లేడీ సూపర్‌స్టార్' పిలుపంటే నచ్చదని, హీరోయిన్లను కూడా హీరోల మాదిరిగానే సూపర్‌స్టార్ అంటూ అభివర్ణించాలన్నారు. ఈ వ్యాఖ్యలపై నయనతార అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నయనతారను దృష్టిలో పెట్టుకునే ఆమె ఈ వ్యాఖ్యలు చేశారని భావించిన వాళ్లు.. మాళవికను విమర్శిస్తూ సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారు. దీంతో ఆమె తాజాగా వివరణ ఇచ్చారు. "నటీమణులందరినీ ఉద్దేశిస్తూ ఆ పదాన్ని ఉపయోగించి నా అభిప్రాయాన్ని బయటపెట్టాను. అంతేకానీ, కచ్చితంగా ఒక్క హీరోయిన్‌నే ఉద్దేశించి నేను మాట్లాడలేదు. నాకు నయనతార అంటే ఎంతో ఇష్టం. ఆమెను ఒక సీనియర్‌గా భావించి.. నటనపరంగా ప్రేరణ పొందుతాను. దయచేసి మీ అందరూ కాస్త శాంతించండి" అని క్లారిటీ ఇచ్చారు.

ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి... లేకుంటే ఉద్యమం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులకు రావల్సిన బకాలన్నీ వెంటనే చెల్లించాలని, 11వ పీఆర్సీ పూర్తి స్థాయిలో అమలు చేసేలా చూడాలని, లేకుంటే 26 నుంచి ఉద్యమానికి సన్నద్ధమవుతామని ఏపీ జేఏసీ అమరావతి ప్రకటించింది. సోమవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కేఎస్ జవహర్‌రెడ్డికి ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్ అధ్వర్యంలో 50పేజీలతో కూడిన ఉద్యోగుల సమస్య పరిష్కారంపై ఉద్యోగ సంఘాల నేతలు వినతిపత్రం అందజేశారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనీ, ఔట్ సోర్సింగు సిబ్బందికి జీతాలు పెంచాలని కోరారు. పబ్లిక్ సెక్టారు/గురుకులాలు/యూనివర్సిటీ నాన్ టీచింగు ఉద్యోగుల వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, ఆర్టీసీ ఉద్యోగులకు పెండింగ్ పెట్టిన 2096 ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలని, పెండింగ్ పెట్టిన ఓటీ అలవెన్సులు మంజూరు చేయాలన్నారు. ఉద్యోగులకు మెరుగైన వైద్యసౌకర్యాలు అందించాలని, పెండింగ్ మెడికల్ బిల్లులు చెల్లించాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ, గర్భిణీ సమయపు సెలవులను మంజూరు చేయాలని, చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులందరికీ ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైద్యరంగంలో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందికి సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని, ప్రభుత్వ శాఖలలో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈనెల 26లోగా సీఎస్‌కు ఇచ్చిన లేఖపై ప్రభుత్వం స్పందించి తమ సమస్యల్ని పరిష్కరించాలని, లేకుంటే 26 నుంచి ఉద్యమ కార్యాచరణకు దిగుతామని ఏపీ జేఏసీ అమరావతి నేతలు బొప్పరాజు, దామోదర్ వెల్లడించారు.

మహిళల ఐపీఎల్ వేలం

స్మృతికి జాక్‌పాట్

- రూ.3.4కోట్లకు సొంతం చేసుకున్న ఆర్‌సీబీ
- రూ.1.8 కోట్లు పలికిక హర్మన్‌ప్రీత్ కౌర్

ముంబై: ఉమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) అరంగేట్ర సీజన్‌కు సంబంధించిన వేలంలో మహిళా క్రికెటర్ల పంట పండింది. ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు కోట్ల వర్షం కురిపించాయి. ముంబైలోని జియో కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరుగుతున్న వేలంలో తమకు కావాల్సిన ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలు ఎంతకైనా తెగిస్తున్నారు. భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన రూ.3 కోట్ల 40 లక్షల రూపాయలు పలకగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ రూ.1.8 కోట్లు దక్కించుకుంది. టీమిండియా ఆల్‌రౌండర్ దీప్తి శర్మ రూ.2.6 కోట్లు పలికింది. వేలంలో ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్లకు జాక్ పాట్ ధర లభిస్తోంది. బిగ్‌బాష్ లీగ్ ఆడిన అనుభవం ఉండటంతో ఆస్ట్రేలియా ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలు ఎగబడుతున్నాయి. స్మృతి మంధానను రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)రూ.3.4 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. ఇదే అత్యధిక ధర కాగా.. ఆస్ట్రేలియా ప్లేయర్ నాట్ సివర్ రూ.3.2 కోట్లకు ముంబై ఇండియన్స్ తీసుకోగా.. అష్లే గ్రహమ్‌ను గుజరాత్ జెయింట్స్ రూ.3.2 కోట్లకు కొనుగోలు చేసింది. దీప్తి శర్మను రూ.2.6 కోట్లకు యూపీ ఫ్రాంచైజీ తీసుకుంది. వేలం నిబంధనల ప్రకారం ఒక్కో జట్టు దగ్గర రూ.12 కోట్ల పర్స్ మనీ ఉండగా.. ఒక్కో జట్టు గరిష్టంగా 18 మంది.. కనిష్టంగా 15 మందిని కొనుగోలు చేయాలి. ఇందులో ఆరుగురు విదేశీ ప్లేయర్లు మాత్రమే ఉండాలి. డబ్ల్యూపీఎల్‌ను మార్చి 4 నుంచి 26 వరకు నిర్వహిస్తామని బీసీసీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. ఐదు జట్ల మధ్య మొత్తం 22 మ్యాచ్‌లు ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం, బ్రాబౌర్న్ స్టేడియం వేదికలుగా జరుగుతాయని పేర్కొంది. ఐపీఎల్ తరహాలో రాత్రి 7 గంటలకు మ్యాచ్‌లు ప్రారంభంకానున్నాయి. డబుల్ హెడర్ ఉన్నప్పుడు మధ్యాహ్నం 3.30 గంటలకు మొదటి మ్యాచ్ జరగనుంది.

అత్యధిక ధర పలికిన ప్లేయర్లు

స్మృతి మంధానా (ఆర్‌సీబీ)	రూ.3.4 కోట్లు
నాట్ సివర్ (ముంబై)	రూ.3.2 కోట్లు
అష్లే గార్డనర్ (గుజరాత్ జెయింట్స్)	రూ.3.2 కోట్లు
దీప్తి శర్మ (యూపీ)	రూ.2.6 కోట్ల
జెమీమా రోడ్రిగ్స్ (ఢిల్లీ క్యాపిటల్స్)	రూ.2.2 కోట్లు
షెఫాలీ వర్మ (ఢిల్లీ క్యాపిటల్స్)	రూ.2 కోట్లు
బెత్ మూనీ (గుజరాత్)	రూ.2 కోట్లు
హర్మన్‌ప్రీత్ కౌర్(ముంబై)	రూ.1.8 కోట్లు
ఎక్లెస్టోన్(యూపీ)	రూ.1.8 కోట్లు
తహిళా మెక్‌గ్రాత్(యూపీ)	1.4 కోట్లు
రేణుక సింగ్ (ఆర్‌సీబీ)	రూ.1.5 కోట్లు
ఎల్లిస్ పెర్రీ(ఆర్‌సీబీ)	రూ.1.7 కోట్లు

ఇండోర్‌లో మూడో టెస్టు

ముంబై: బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య మార్చి 1 నుంచి ధర్మశాలలో జరగాల్సిన మూడో టెస్టును మరో చోటుకు తరలించారు. మూడో టెస్టుకు ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనున్నట్లు బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ధర్మశాలలో ఔట్‌ఫీల్డ్ సిద్ధంగా లేకపోవడమే అందుకు కారణమని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. బీసీసీఐ క్యూరేటర్ తపోష్ ఛటర్జీ ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ సంఘం (హెచ్‌పీసీఏ) స్టేడియం పిచ్, ఔట్‌ఫీల్డ్‌ను తనిఖీ చేసి బోర్డుకు నివేదిక అందించాడు. అయితే, తొలుత ఈ మ్యాచ్‌ని విశాఖపట్నం లేదా బెంగళూరుకు తరలిస్తారని వార్తలొచ్చాయి. చివరికి ఇండోర్‌ని వేదికగా ఖరారు చేస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. ఇక, సిరీస్ విషయానికొస్తే నాగ్‌పూర్‌లో జరిగిన తొలి టెస్టులో టీమిండియా ఇన్నింగ్స్ 132 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఢిల్లీ వేదికగా ఫిబ్రవరి 17 నుంచి రెండో టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో కూడా కంగారు జట్టును కంగుతినిపించాలని టీమిండియా భావిస్తోంది. తొలి టెస్టులో ఘోర ఓటమిపాలైన ఆసీస్ ఈ మ్యాచ్‌లో గెలిచి పుంజుకోవాలని చూస్తోంది. ఇందులో భాగంగానే కొత్త స్పిన్నర్ మాట్ కుహ్నెమాన్‌ను జట్టులోకి తీసుకుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.